


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 317 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 19 జూలై 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :317 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 19 JULY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

## ముందు ఎన్సీపీ విలీనం.. తర్వాత ఎన్డీయేలోకి.. మహారాష్ట్రలో బీజేపీ మాస్టర్ ప్లాన్!

- ఎన్సీపీ విలీనంపై జోరుగా చర్చలు
- ముందు విలీనం.. తర్వాత ఎన్డీయే ఫార్ములా
- 15 రోజుల్లో తుది ప్రకటనకు అవకాశం
- విలీనం లేకపోతే ప్రత్యేకంగానే ఎన్డీయేలో చేరే ఛాన్స్
- అధ్యక్ష పదవిపై సునేత్రా పవార్ పట్టు



పెన్ పవర్ డెస్క్:మహారాష్ట్ర రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకునే సూచనలు కనిపిస్తున్నాయి. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ (ఎస్పీ) ఎన్డీయేలో చేరే అవకాశాలపై చర్చలు జరుగుతున్న వేళ.. ముందుగా ఎన్సీపీ రెండు వర్గాలు విలీనం కావాలనే

- మిగతా 2లో

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

- ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామన్న కోమటిరెడ్డి
- ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య
- పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్న మంత్రి



పెన్ పవర్ డెస్క్:తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న

- మిగతా 2లో




# 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు

- రాష్ట్రవ్యాప్తంగా రూ.15,274 కోట్ల పట్టణాభివృద్ధి పనులకు గుడివాడ నుంచి శ్రీకారం
- బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారన్న చంద్రబాబు
- అక్టోబర్ 2 నాటికి ఏపీని చెత్త రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని ప్రకటన
- భావ ప్రకటనా స్వేచ్ఛ పేరుతో అసభ్య పోస్టులను సహించేది లేదని హెచ్చరిక
- ఈ నెల 22 నుంచి "తల్లికి వందనం" కింద తల్లుల ఖాతాల్లో నిధులు జమ



పెన్ పవర్ డెస్క్:పరిశుభ్రమైన, సంపన్నమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే లక్ష్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని, 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. బూతులు తిట్టిన వారి నోళ్లను ప్రజలు తమ ఓట్లతో కడిగేశారని ఘాటుగా వ్యాఖ్యానించారు. కృష్ణా జిల్లా గుడివాడలో శనివారం జరిగిన 18వ స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 120 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ ఇంజినీరింగ్ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. అక్టోబర్ 2వ తేదీ నాటికి రాష్ట్రాన్ని కాలుష్య రహిత, చెత్త రహిత ప్రాంతంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

స్వచ్ఛ రాజకీయాల కోసమే ఎన్టీఆర్ పార్టీ స్థాపన

దివంగత ఎన్టీఆర్ తొలిసారి ప్రజాక్షేత్రంలో నిలిచిన గుడివాడ నుంచే స్వచ్ఛ రాజకీయాలకు పునాది పడిందని చంద్రబాబు గుర్తుచేశారు. స్వచ్ఛమైన రాజకీయాలు, స్వచ్ఛమైన ప్రజాప్రతినిధులు, తెలుగువారి ఆత్మగౌరవం అనే లక్ష్యాలతోనే ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని తెలిపారు. గతంలో ఉన్న స్వార్థ రాజకీయాలను పక్కనపెట్టి అభివృద్ధి, సంక్షేమానికి ఆయన శ్రీకారం చుట్టారని అన్నారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి, సంపద సృష్టి లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు కట్టుబడి ఉన్నామని హామీ ఇచ్చారు. పరిశుభ్రత అంటే కేవలం రోడ్లు ఊడ్చడం కాదని, పర్యావరణాన్ని, ప్రజారోగ్యాన్ని కాపాడటమే అసలు లక్ష్యమని వివరించారు.

- మిగతా 2లో




## ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

- భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారు
- ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవం
- ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఇది మైలురాయి అని సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- జీఎంఆర్ నిర్మించిన ఈ ప్రాజెక్ట్ తొలిదశ వ్యయం రూ. 4,592 కోట్లు
- తొలిదశలో ఏటా 63 లక్షల మంది ప్రయాణికులకు సేవలు

- మిగతా 2లో



## ధర్మేంద్ర ప్రధాన్ కాదు.. మోడీ రాజీనామా చేయాలి

### కాక్రోచ్ పార్టీ కొత్త డిమాండ్

పెన్ పవర్ డెస్క్: నీట్ పేపర్ లీక్, విద్యా వ్యవస్థలోని అక్రమాలకు నిరసనగా ప్రముఖ పర్యావరణ, విద్యావేత్త సోనమ్ వాంగ్ చుక్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేయడంపై కాక్రోచ్ జనతా పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష భగ్నం చేసినా మా ఉద్యమం ఆగదని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. సోనమ్ స్థానంలో మేం ఇక్కడే ఉంటాం.. ఇక్కడే మా పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేసింది. ముందుగా చెప్పినట్లే జులై 20న తలపెట్టిన చలో పార్లమెంట్

- మిగతా 2లో

## గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి.. చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

- పోలవరం జిల్లా ఎటపాక మండలంలో విషాదకర ఘటన
- గోదావరిన నీటి ప్రవాహానికి కొట్టుకుపోయిన గిరిజనులు
- బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్న చంద్రబాబు
- ఈ ఉదంతం కలచివేసిందన్న పవన్



పెన్ పవర్ డెస్క్:పోలవరం జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం వద్ద గోదావరి నదిలో చేపల వేటకు వెళ్లి ఐదుగురు స్థానికులు

- మిగతా 2లో

## మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ

- గుంటూరులో మహిళపై టీడీపీ నేత దాడి ఘటనపై జగన్ ఆగ్రహం
- బుధవారం ఘటన జరిగితే మూడు రోజులు కప్పిపుచ్చారని ఆరోపణ
- ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించలేదని తీవ్ర విమర్శలు
- ఇదేనా సుపరిపాలన, మహిళా భద్రత అంటూ సర్కారుకు ప్రశ్నలు
- మహిళల ఆగ్రహం ప్రభుత్వానికి బుద్ధి చెబుతుందని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:గుంటూరులో ఒక మహిళను వివస్త్రను చేసి, టీడీపీ నాయకుడు దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ అని, రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ ఎంత ఘోరంగా

- మిగతా 2లో

## హైదరాబాదులో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్..

- గతంలో పవన్ భుజానికి గాయం
- ఇటీవల ముంబైలో విజయవంతంగా శస్త్రచికిత్స
- కొన్ని రోజుల కిందటే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి
- హైదరాబాదులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైనం
- పవనన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన లోకేశ్



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం పరామర్శించారు. ఇటీవల ముంబ యిలో భుజానికి శస్త్రచికిత్స చేయిం చుకుని

- మిగతా 2లో

## బహదూర్‌గూడలో మళ్లీ ఉద్రిక్తత.. పోలీసులపై కారం చల్లిన రైతులు

- బహదూర్‌గూడలో భూసేకరణపై ఘర్షణ
- పోలీసులపై కారం చల్లి దాడి చేసిన రైతులు
- కానిస్టేబుళ్లు సహా పలువు పోలీసులకు గాయాలు
- 600 ఎకరాల భూముల స్వాధీనానికి వ్యతిరేకత
- ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగింపు



పెన్ పవర్ డెస్క్:రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం భూసేకరణ వ్యవహారం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. భూములు స్వాధీనం చేసుకునేందుకు అధికారులు వెళ్లగా రైతులు అడ్డుకోవడంతో

- మిగతా 2లో

## గోదావరిలో ఐదుగురు గిరిజన మహిళలు గల్లంతు: ముగ్గురి మృతదేహాలు లభ్యం



పెన్ పవర్ డెస్క్:అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం గొల్లగూడెం దగ్గర గోదావరి నదిలో ఘోర ప్రమాదం జరిగింది. చేపలు పట్టడానికి వెళ్లిన ఐదుగురు గిరిజన మహిళలు నదిలో మునిగిపోయారు. నదిలో చేపలు పడుతున్న సమయంలో, నీళ్లు లోతుగా ఉన్న వైపు వెళ్లడం వల్లే వీరంతా కొట్టుకుపోయినట్లు తెలుస్తోంది.

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన ఘటన మానవత్వానికే మచ్చ

- మొదటి పేజి తరువాయి

విఫలమైందో చెప్పడానికి ఇది నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ మండిపడ్డారు. ఈ దారుణానికి చంద్రబాబు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలని ఆయన విమర్శించారు. ఈ ఘటన బుధవారమే జరిగినా, మూడు రోజులపాటు దానిని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని, చివరకు ఆ వీడియోలు సోషల్ మీడియాలో బయటకు వచ్చి రాష్ట్ర ప్రజలంతా ఈ పరిపాలనను అసహ్యించుకున్న తర్వాతే ప్రభుత్వం స్పందించిందని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పుడు తానేదో గొప్పగా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హడావుడి చేయడం మరింత సిగ్గుచేటని అన్నారు. ఆ వీడియోలను కప్పిపుచ్చడంపై చూపిన శ్రద్ధను నిందితులను పట్టుకోవడంపై చూపలేదని జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం తనపై తొలిసారి దాడి జరిగిన వెంటనే బాధితురాలు పోలీసులను ఆశ్రయించినప్పుడు వారు స్పందించి ఉంటే, ఆ తర్వాత ఇంతటి ఘోరం జరిగేది కాదు కదా అని ప్రశ్నించారు. ఆమె ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని ఉంటే ఈ దారుణం జరిగేదా? అని నిలదీశారు. ఫిర్యాదు చేసిన మహిళకు రక్షణ కల్పించకుండా మౌనం వహించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. "అసలు పోలీస్ స్టేషన్లు ఉన్నది ఎందుకు? బాధితుల ఫిర్యాదులను స్వీకరించడానికా? లేక అధికార పార్టీ నాయకులు ఏం చెబితే అది చేయడానికా? బాధితురాలికి అండగా నిలవకపోగా, పంచాయితీలు చేయడానికి ప్రయత్నిస్తారా? వీడియోలు బయటకు వస్తేనే చట్టం మేల్కొంటుందా? బాధితురాలి ఫిర్యాదుకు విలువ లేదా? నేరం జరుగుతున్నప్పుడు స్పందించకుండా, ప్రజల్లో ఆగ్రహం పెల్లుబికిన తర్వాత చర్యల పేరుతో నాటకాలు ఆడటం ఏ రకమైన పోలీసింగ్? రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులపై ఈ చంద్రబాబు ప్రభుత్వం కావాలనే దాడులను ప్రోత్సహించింది. ఆ అరాచకాలను కప్పిపుచ్చడానికి పోలీసు వ్యవస్థను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకుంది. చట్టాన్ని అధికార పార్టీకి చుట్టంగా, ప్రతిపక్షాలపై వేధింపులకు, అక్రమ కేసులకు ఒక సాధనంగా మార్చి రాష్ట్రాన్ని జంగిల్‌రాజ్‌గా దిగజార్చింది" అని ఆయన తీవ్రంగా విమర్శించారు.

అధికార పార్టీ నాయకులు ఏం చేసినా పోలీసులు రక్షిస్తారనే ధైర్యం ఈ రెడ్‌బుక్‌పాలనలో గ్రామాలు, వార్డుల స్థాయి వరకూ పాకిందని జగన్ అన్నారు. అందుకే టీడీపీ కూటమికి చెందిన పలువురు నాయకులు దుశ్శాసనుల్లా తయారయ్యారని మండిపడ్డారు. ఎలాంటి దారుణాలు చేసినా, ముఖ్యంగా మహిళలపై దాడి చేసినా, తమను కాపాడటానికి చంద్రబాబు ఉన్నారనే ధైర్యం వారిలో పెరిగిపోయిందని ధ్వజమెత్తారు.

ఈ పరిస్థితి రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా చేసిందని జగన్ ఆరోపించారు. అధికార పార్టీ నాయకుల దురాగతాల నుంచి తమను తాము కాపాడుకోవాల్సిన దుస్థితికి మహిళల చేరుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "చంద్రబాబు గారూ, ఇదేనా మీరు చెప్పే మహిళా భద్రత? ఇదేనా మీ సుపరిపాలన? ఇదేనా మీ పోలీసింగ్? మహిళల ఆగ్రహమే మీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతుంది" అని ఆయన హెచ్చరించారు.

### గోదావరిలో గల్లంతైన ఐదుగురూ మృతి.. చంద్రబాబు, పవన్ దిగ్భ్రాంతి

- మొదటి పేజి తరువాయి

ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు ఇలా మృత్యువాత పడటం అత్యంత విచారకరమని, బాధిత కుటుంబాలకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే చంద్రబాబు అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందిన తుర్రం భారతి, ఊకే సుశీల, ఊకే లక్ష్మి, బాసిబోయిన బాలరాజు, ఊకే రమేశ్ అనే ఐదుగురు ఈ దుర్ఘటనలో మరణించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. బాధిత కుటుంబాలకు తక్షణమే అవసరమైన ఆర్థిక, నిత్యావసర సహాయ సహకారాలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ దారుణ ఉదంతం తనను తీవ్రంగా కలిచివేసిందనిపవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన పోలవరం జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేసి, ఘటనకు దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ.. ప్రభుత్వం తరఫున వారికి ఎలాంటి లోటు రాకుండా సహాయ చర్యలు ముమ్మరం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ప్రమాదంపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కూడా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఆమె ఫోన్‌లో మాట్లాడి సహాయక చర్యలను పర్యవేక్షించారు. సాధారణంగా చేపల వేటకు వెళ్లే ప్రాంతంలో ఈ ప్రమాదం ఎలా జరిగిందనే కోణంలో సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు తక్షణ ప్రభుత్వ సాయం అందేలా చూడాలని జిల్లా యంత్రాంగానికి స్పష్టం చేస్తూ... మృతుల కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆమె ఆకాంక్షించారు

### బహదూర్‌గూడలో మళ్లీ ఉద్రిక్తత.. పోలీసులపై కారం చల్లిన రైతులు

- మొదటి పేజి తరువాయి

పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహానికి గురైన కొందరు రైతులు పోలీసులపై కారం చల్లి, రాళ్లు, కుర్చీలు విసురుతూ దాడికి దిగారు. ఈ ఘటనలో పలువురు కానిస్టేబుళ్లు, ఎస్ఐలు, సీఐలకు గాయాలయ్యాయి. గాయపడిన అధికారులకు చికిత్స అందించారు. డీసీపీకి కూడా గాయాలైనట్టు తెలుస్తోంది. ఈ ఘటటనతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సుమారు 600 ఎకరాల భూమిని సేకరించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. అయితే తమ భూములను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమంటూ రైతులు ఐదు రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారు. తమకు స్పష్టమైన హామీ ఇచ్చిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

భూముల స్వాధీన ప్రక్రియ కోసం శనివారం ఉదయం హైడ్రా అధికారులు భారీ బందోబస్తుతో అక్కడికి చేరుకున్నారు. అధికారులు ముందుకు సాగేందుకు ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. ఉదయం మొదలైన ఉద్రిక్తత సాయంత్రానికి మరింత తీవ్రరూపం దాల్చింది. పరిస్థితి చేదాటడంతో డీసీపీ యోగేశ్ గౌతమ్ రంగంలోకి దిగారు. వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఇది ఆరంభం మాత్రమేనని, చర్చలు జరిపిన తర్వాతే తుది నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు. ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా కలెక్టర్‌కు విన్నవించుకునే అవకాశం కల్పిస్తారని చెప్పారు. రైతుల అనుమతి లేకుండా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోబోరని హామీ ఇచ్చారు. అయినప్పటికీ.. రైతులు వెనక్కి తగ్గలేదు. నిరసన కొనసాగిస్తామని భీష్మించారు.

# భారత అంతరిక్ష చరిత్రలో నవశకం.. తొలి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్-1' ప్రయోగం సక్సెస్

'మిషన్ ఆగమన్' పేరుతో చేపట్టిన ఈ ప్రయోగం భారత ప్రైవేట్ అంతరిక్ష పరిశ్రమ రాకను సూచిస్తుంది. తొలుత ఒక అంతర్గత సాంకేతిక సమస్య కారణంగా కొద్దిసేపు నిలిపివేసినా, ఆ తర్వాత రాకెట్ ప్రణాళిక ప్రకారమే నిప్పులు చిమ్ముతూ ఆకాశంలోకి దూసుకెళ్లింది. రాకెట్‌కు సంబంధించిన నాలుగు దశలు అనుకున్నట్టుగానే పనిచేయడమే కాకుండా ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టే ప్రక్రియ కూడా తొలి ప్రయత్నంలోనే విజయవంతమైంది. ఈ చారిత్రక విజయం స్కైరూట్ బృందంలో కొత్త ఉత్సాహాన్ని నింపింది.

**'విక్రమ్-1' ప్రత్యేకతలు**

దాదాపు ఏడు అంతస్తుల ఎత్తు ఉండే విక్రమ్-1 రాకెట్‌ను పూర్తిగా కార్బన్ కాంపోజిట్ మెటీరియల్‌తో నిర్మించారు. ఇది 350 కిలోల బరువున్న పేలోడ్లను భూమికి సమీపంలోని కక్ష్య (లో ఎర్త్ ఆర్బిట్)లోకి మోసుకెళ్లగలదు. ఈ రాకెట్‌లో ఉపయోగించిన ప్రొపల్షన్ సిస్టమ్స్, అధునాతన 3డి-ప్రింటెడ్ ఇంజన్లు, హై-పెర్ఫార్మెన్స్ సాలిడ్ రాకెట్ మోటార్లు వంటి కీలక భాగాలన్నింటినీ స్కైరూట్ సంస్థే స్వయంగా అభివృద్ధి చేసింది.

ఈ తొలి ప్రయోగంలో గ్రాహ్ స్పేస్, కాస్మోసర్వ్, డీక్యూబ్డ్ వంటి సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు, స్కైరూట్‌కు చెందిన 'స్కోప్' ప్రయోగాన్ని కూడా పంపించారు. వీటితో పాటు కొన్ని ప్రత్యేకమైన వస్తువులను కూడా అంతరిక్షంలోకి పంపారు. వాటిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వదస్తూరితో రాసిన 'వందేమాతరం' పోస్ట్‌కార్డ్, ఇస్రో ప్రస్తుత, మాజీ చైర్మన్లు, భారత వ్యోమగాములు, స్కైరూట్ ఉద్యోగులు, పెట్టుబడిదారులు రాసిన సందేశాలు ఉన్నాయి. ఈ విజయం కేవలం రాకెట్ పనితీరును నిర్ధారించడానికే పరిమితం కాదు. అంతరిక్ష రంగంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ సంస్థలకు కూడా తలుపులు తెరుస్తూ కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలకు ఇది ఒక పెద్ద విజయంగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ ప్రయోగం ద్వారా లభించిన కీలకమైన ఇంజినీరింగ్ డేటా, భవిష్యత్తులో విక్రమ్ సిరీస్ రాకెట్లను మరింత మెరుగుపరచడానికి, క్రమం తప్పకుండా వాణిజ్య ప్రయోగాలు చేపట్టడానికి స్కైరూట్‌కు సహాయపడుతుంది.

ఇస్రో మాజీ శాస్త్రవేత్తలైన పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకా 2018లో స్కైరూట్ ఏరోస్పేస్‌ను స్థాపించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న చిన్న ఉపగ్రహాల మార్కెట్‌కు తక్కువ ఖర్చుతో, నమ్మకమైన సేవలు అందించడమే లక్ష్యంగా వారు ఈ సంస్థను ప్రారంభించారు.

2022లో 'విక్రమ్-ఎస్' అనే సబ్-ఆర్బిటాల్ రాకెట్‌ను ప్రయోగించి, అంతరిక్షంలోకి రాకెట్‌ను పంపిన తొలి భారతీయ ప్రైవేట్ సంస్థగా స్కైరూట్ ఇప్పటికే చరిత్ర సృష్టించిన విషయం తెలిసిందే. తాజా విజయంతో భారత అంతరిక్ష యానంలో ఇస్రోతో పాటు ప్రైవేట్ రంగం కూడా ఒక కీలక శక్తిగా నిలిచింది.

## 2024లో రాజకీయ చెత్తను ప్రజలే శుభ్రం చేశారు

- మొదటి పేజి తరువాయి

**అక్టోబర్ 2 నాటికి చెత్త రహిత రాష్ట్రం**

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో 140 లక్షల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయిందని, దానిని తొలగించి ఇప్పుడు స్వచ్ఛ పథం, ఆపరేషన్ క్లీన్ స్వీప్ వంటి కార్యక్రమాలతో రాష్ట్రాన్ని శుభ్రం చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. అక్టోబర్ 2 నాటికి రాష్ట్రాన్ని చెత్త రహితంగా మారుస్తామని ప్రకటించారు. దీనికోసం రూ.528 కోట్లతో వ్యర్థాల నిర్వహణ ప్లాంట్లు, చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే 8 ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇంటింటికీ చెత్త సేకరణ కోసం 126 ఎలక్ట్రిక్ ఆటోలను ప్రారంభించామని, త్వరలో మరో 1104 ఇ-ఆటోలు అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి నుంచే తడి, పొడి చెత్తను వేరుచేయాలని, 'నెట్ జీరో' వ్యర్థాల విధానాన్ని అలవాటు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

**తప్పు ఎవరు చేసినా ఉపేక్షించం**

గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని, ప్రజలు సంతోషంగా జీవించే పరిస్థితి లేకపోయిందని చంద్రబాబు విమర్శించారు. రాజకీయాల్లో క్రిమినల్ ధోరణులు, కుట్రలు, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులతో ప్రజలను వేధిస్తున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై అసభ్య పోస్టులు పెట్టి, ప్రశ్నిస్తే భావ ప్రకటనా స్వేచ్ఛ అనడం దారుణమన్నారు.

ప్రజల జీవితాలకు ఆటంకం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవడానికి వీల్లేదని, తప్పు చేసిన వ్యక్తి ఏ పార్టీకి చెందిన వారైనా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గుంటూరులో మహిళ పట్ల దురుసుగా ప్రవర్తించిన టీడీపీ కార్యకర్తను తక్షణమే పార్టీ నుంచి సస్పెండ్ చేసి అరెస్ట్ చేయించామని, శ్రీకాకుళం ఘటనలోనూ బాధితులకు న్యాయం చేస్తామని తెలిపారు.

**సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు**

తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రభుత్వం వద్ద డబ్బు లేకపోయినా, పేదల పక్షాన నిలిచే మనసుందని అన్నారు. ఈ నెల 22 నుంచి 24 మధ్య "తల్లికి వందనం" పథకం కింద 67.47 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.10,122 కోట్లు జమ చేయనున్నట్లు ప్రకటించారు.

మరోవైపు, 12 ఏళ్ల క్రితం నీళ్లు లేక ఇబ్బంది పడిన కృష్ణా డెల్టాకు పట్టిసీమ ద్వారా 450 టీఎంసీల గోదావరి జలాలను అందించి రూ.50 వేల కోట్ల సంపద సృష్టించామని గుర్తుచేశారు. అక్వా రైతులకు యూనిట్‌కు రూ.1.50కే విద్యుత్ అందిస్తూ ఆదుకుంటున్నామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో భాగంగా గుడివాడ బస్టాండ్ అభివృద్ధికి అన్నే నరసింహారావు దంపతులు రూ.3 కోట్లు విరాళం ప్రకటించారు. సాయి శ్వేత అనే గృహిణి అమరావతి కోసం తన బంగారు గాజులను విరాళంగా ఇచ్చారు. వారిని ముఖ్యమంత్రి అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి.నారాయణ, కొల్లు రవీంద్ర, వాసంశెట్టి సుభాష్, ఎంపీ బాలశౌరి, స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు.

### గోదావరిలో ఐదుగురు గిరిజన మహిళలు గల్లంతు: ముగ్గురి మృతదేహాలు లభ్యం

- మొదటి పేజి తరువాయి

ప్రమాదానికి గురైన వారంతా గొమ్ముకొత్తగూడెం గ్రామానికి చెందినవారు. ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, స్థానికులు కలిసి నదిలో గాలింపు చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు ముగ్గురి మృతదేహాలు లభ్యమవ్వగా, మిగిలిన ఇద్దరి కోసం వెతుకులాట కొనసాగుతోంది. మరణించిన వారిని ఊకె సుశీల (37), ఊకె లక్ష్మి (37), తుర్రం భారతి (40), భాసుబోయిన బాలరాజు (38), ఊకె రమేష్ (38)గా గుర్తించారు. ఒకే గ్రామానికి చెందిన ఐదుగురు చనిపోవడంతో గొమ్ముకొత్తగూడెం గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రస్తుతం మృతదేహాలను పోస్టుమార్టం కోసం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాక వారి కుటుంబ సభ్యులకు అప్పగించనున్నారు. కాగా, ఈ ప్రమాదంపై ఏపీ మంత్రి సంధ్యారాణి స్పందిస్తూ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

### ఆగస్టు 1న చరిత్రలో నిలిచిపోయేలా భోగాపురం ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం

ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. విశాఖపట్నం సమీపంలోని భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఆగస్టు 1న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టును లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. దీంతో గత కొంతకాలంగా ప్రారంభోత్సవ తేదీపై నెలకొన్న ఊహాగానాలకు తెరపడింది. శనివారం సాయంత్రం విమానాశ్రయ నిర్మాణ పనుల పురోగతిపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన చంద్రబాబు, ఈ కీలక ప్రకటన చేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చరిత్రలో నిలిచిపోయేలా అత్యంత ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధిలో ఒక చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలోని పర్యాటకం, పోర్టులు, జాతీయ రహదారులు, పారిశ్రామిక ప్రగతితో కలిసి ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రను 'అన్‌స్టాపబుల్' శక్తిగా మారుస్తుందని ఆయన పేర్కొన్నారు. విజయనగరం జిల్లా భోగాపురం వద్ద, విశాఖ నగరానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో జాతీయ రహదారి-16కు సమీపంలో సుమారు 2,200 ఎకరాల విస్తీర్ణంలో ఈ విమానాశ్రయాన్ని నిర్మించారు. ప్రఖ్యాత మౌలిక సదుపాయాల సంస్థ జీఎంఆర్ గ్రూప్‌కు చెందిన 'జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (+ఎ×ూూ)' ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. తొలి దశలో భాగంగా రూ. 4,592 కోట్ల వ్యయంతో ఎయిర్‌పోర్టును నిర్మించారు. మొదటి దశలో ఏటా 63 లక్షల (6.3 మిలియన్ల) మంది ప్రయాణికులకు సేవలు అందించే సామర్థ్యంతో టెర్మినల్ భవనాన్ని తీర్చిదిద్దారు. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రెండో దశలో 1.2 కోట్లు, మూడో దశలో 1.8 కోట్ల మందికి విస్తరించేలా మాస్టర్ ప్లాన్ రూపొందించారు. ఈ ప్రాజెక్టు పలు ప్రభుత్వాల హయాంలో పురోగతి సాధించింది. 2019 ఫిబ్రవరిలో అప్పటి ముఖ్యమంత్రిగా చంద్రబాబు శంకుస్థాపన చేశారు. 2024 సెప్టెంబర్‌లో ఈ విమానాశ్రయానికి 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం'గా నామకరణం చేశారు. ప్రస్తుతం విశాఖ నగరంలోని ఐఎన్ఎస్ డేగా నేవల్ ఎయిర్‌బేస్ నుంచి కొనసాగుతున్న పౌర విమానయాన కార్యకలాపాలు దశలవారీగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు మారనున్నాయి. ఈ విమానాశ్రయం చుట్టూ 'ఏరోట్రోపాలిస్'ను అభివృద్ధి చేసే ప్రణాళికలు కూడా ఉన్నాయి. ఈ విమానాశ్రయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర పారిశ్రామిక, పర్యాటక రంగాలకు కొత్త ఊపు వస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

## రాష్ట్రంలో గుడిసెలు లేకుండా చేస్తాం

- మొదటి పేజి తరువాయి

రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.

## ధర్మేంద్ర ప్రధాన్ కాదు.. మోడీ రాజీనామా చేయాలి

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమం చేసి తీరుతామని తేల్చిచెప్పింది.

ఈ సందర్భంగా కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కే మాట్లాడుతూ.. సోనమ్ వాంగ్ చుక్? దీక్షను భగ్నం చేసినంత మాత్రాన మా ఉద్యమం ఆగుతుందనుకుంటే అది వారి పొరపాటేనని అన్నారు. మేము ఇప్పటి వరకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశాం.. కానీ శాంతియుతంగా చేస్తోన్న మా దీక్షను భగ్నం చేశాక ఇప్పుడు ప్రధాని మోడీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నామని దీప్కే పేర్కొన్నారు. మేం ఇక్కడే ఉంటాం.. సోనమ్ స్థానంలో దీక్షను యధావిధిగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జులై 20న తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమం విజయవంతం చేసి తీరుతామని ధీమా వ్యక్తం చేశారు. ఎవరూ వెనక్కి తగ్గొద్దని.. పెద్ద ఎత్తున జంతర్ మంతర్?కు తరలిరావాలని మద్దతుదారులకు సూచించారు.

సోనమ్ వాంగ్ చుక్?ను దీక్షా శిబిరం నుంచి పోలీసులు బలవంతంగా ఈడ్చుకెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సీజేపీ మద్దతుదారులపై పోలీసులు విచక్షణరహితంగా ప్రవర్తించారని మండిపడ్డారు. శాంతియుతంగా చేస్తోన్న తమ దీక్షను భగ్నం చేసి ప్రభుత్వం పెద్ద తప్పు చేసిందని అన్నారు. మమ్మల్ని ఎంత అణగదొక్కాలని చూస్తే అంతకు రెట్టింపు వేగంతో మా ఉద్యమం మరింత విస్తరిస్తుందని హెచ్చరించారు.

## హైదరాబాదులో పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్..

- మొదటి పేజి తరువాయి

హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్‌ను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా "పవనన్న త్వరగా కోలుకోవాలి" అని ఆయన ఆకాంక్షించారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. భుజానికి అయిన గాయం, జరిగిన శస్త్రచికిత్స వివరాలను అడిగారు. వైద్యుల సూచనల మేరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. తన పరామర్శ అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని పరామర్శించాను. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించాను. వైద్యుల సూచనలు పాటిస్తూ వీలైనంత మేర విశ్రాంతి తీసుకోవాలని సూచించాను" అని తెలిపారు. గతంలో భుజానికి గాయం కావడంతో పవన్ కల్యాణ్ కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో ఆయన కుడి భుజానికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఆయన హైదరాబాద్‌లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వచ్చి పరామర్శిస్తున్నారు.

### ముందు ఎన్సీపీ విలీనం.. తర్వాత ఎన్డీయేలోకి.. మహారాష్ట్రలో బీజేపీ మాస్టర్ ప్లాన్!

- మొదటి పేజి తరువాయి

ఫార్ములాను బీజేపీ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఈ అంశంపై రెండు వర్గాల మధ్య లోతైన చర్చలు జరుగుతున్నాయని.. 15 రోజుల్లో తుది నిర్ణయం వెలువడే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు చెప్పినట్లు 'న్యూస్18' పేర్కొంది. 2023 జులైలో ఎన్సీపీ చీలిపోయిన తర్వాత అజిత్ పవార్ వర్గం బీజేపీ-శివసేన ప్రభుత్వంలో చేరింది. ఈ ఏడాది బరామతి సమీపంలో జరిగిన విమాన ప్రమాదంలో అజిత్ పవార్ మరణించారు. అప్పటి నుంచి రెండు వర్గాల విలీనంపై మళ్లీ చర్చలు ఊపందుకున్నాయి. ఇటీవల ఎన్డీయే నేతలు, రెండు ఎన్సీపీ వర్గాల ప్రతినిధులు పలుమార్లు సమావేశమైనట్లు సమాచారం. ఒకవేళ విలీనం సాధ్యంకాకపోతే.. శరద్ పవార్ వర్గం ప్రత్యేక పార్టీగానే ఎన్డీయేలో చేరడం లేదా ప్రభుత్వానికి బయట నుంచి మద్దతు ఇవ్వడం వంటి ప్రత్యామ్నాయాలనూ పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ వర్గానికి చెందిన ఎక్కువ మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు నేరుగా ఎన్డీయేలో చేరాలని కోరుకుంటున్నట్లు సమాచారం. కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాల్లో భాగమైతే పార్టీ బలోపేతానికి ఉపయోగపడుతుందని వారు భావిస్తున్నారని తెలుస్తోంది. విలీనం జరిగితే పార్టీ అధ్యక్ష పదవిని సునేత్రా పవార్‌కు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. అలాగే మహారాష్ట్ర ఆర్థిక శాఖ తమ వర్గానికే ఇవ్వాలని ఆమె పట్టుబడుతున్నారని, శరద్ పవార్ వర్గం కూడా అదే శాఖపై ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు లోక్‌సభ స్థానాల సంఖ్య పెంపు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్‌కు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు పార్లమెంట్‌లో మళ్లీ ప్రవేశపెట్టాలని ఎన్డీయే భావిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# రోడ్డును ఆక్రమించుకున్నారు నీరు వెళ్లే దారి మూసేసారు




✸ రెండు జిల్లాల సరిహద్దు సమస్య

**ఆలమూరు, పెన్ పవర్, జూలై 18;** ఈ ఫోటోలు చూస్తే అక్కడ రోడ్డు పూర్తిగా గోతులు పడిపోయింది అనుకుంటున్నారు కదూ అస్సలు కాదు.అది పక్కా సిమెంట్ రోడ్డు. కాకపోతే రోడ్డును పూర్తిగా ఆక్రమించేసి వర్షం నీరు వెళ్లే దారి లేకుండా చేస్తున్నారు. ఎంతో కాలంగా ఆ ప్రాంత ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురుచేస్తున్నారు. మరి అధికారులు ఎందుకు ఊరుకుంటున్నారనే కదా మీ అనుమానం. అది తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల సరిహద్దు. అందువల్ల ఎవరికి వారు పట్టించుకోకుండా వదిలేయడంతో అక్కడ పరిస్థితి అలా తయారైంది. రోడ్డును ఆక్రమించుకుని ఇల్లు, షాపులు నిర్మించుకున్నారు.దీంతో రోడ్డు మీద ఉండే వర్షపు నీరు ఎటు వెళ్లే దారి లేక పెద్ద గొయ్యిగా తయారైంది.వివరాల్లోకి వెళ్తే కడియం మండలం వీరవరం నుంచి పొట్టిలంక,నాగులపేట, మడికి వెళ్లే జిల్లా పరిషత్ రోడ్డు అది.ఆలమూరు మండలం మడికి(మల్లావానితోట) పంచాయతీ పరిధిలోకి వస్తుంది.మండలానికి శివారు గ్రామం కావడంతో అక్కడికి ఆలమూరు మండల అధికారులు అంతగా వెళ్లరు. కడియం రెవెన్యూ అధికారులు మా పరిధిలోది కాదని వాళ్లు వదిలేస్తున్నారు.దీంతో ఇక్కడ సమస్య మాత్రం వర్షాకాలంలో పెద్దదిగా మారుతుంది. మోకాళ్ళు లోతు నీటిలో వాహనదారులు రావాల్సి వస్తుంది. ఇదేమని అడుగుతుంటే మీ దిక్కున వారికి చెప్పుకోండని ఆక్రమణదారులు ఎదురు తిరుగుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అలాగని వారు సొంత స్థలాల్లో ఇల్లు నిర్మించుకుని రోడ్డు ను ఆక్రమించుకోలేదు.రోడ్డునే ఆక్రమించుకుని ఇల్లు లు నిర్మించుకొన్నారు.ఇక్కడ ఇంత దారుణంగా పరిస్థితి ఉన్నా పట్టించుకునే నాధుడే లేకపోతున్నారు. ఇప్పటికైనా రెండు మండలాల రెవెన్యూ అధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి అక్కడ ఆక్రమణలు తొలగించి నీరు వెళ్లే మార్గం చూపాలని పొట్టిలంక,మడికి, నాగులపేట,వీరవరం తదితర గ్రామస్తులు కోరుతున్నారు. కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లు ఆక్రమణల వల్ల ఇలా గోతులుగా మారుతున్నాయి.

# సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి 1,00,116/భారీ విరాళం



**అన్నవరం:పెన్ పవర్ జూలై 18:**కాకినాడ జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్య అన్నదాన పథకానికి .యల్లా వీర గణేష్ విరాళం స్వామివారిపై ఉన్న భక్తిభావంతో ఆయన రూ. 1,00,116/- (అక్షరాలా లక్షా నూట పదహారు రూపాయలు) నగదును దేవస్థాన అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా దాత వీర గణేష్ కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు ప్రత్యేక ఆశీర్వచనాలు అందించి, స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను బహూకరించారు. కొండపైకి వచ్చే భక్తుల ఆకలి తీర్చే ఈ నిత్యాన్నదాన పథకానికి ఇంతటి ఉదారమైన విరాళం అందించినందుకు దేవస్థాన అధికారులు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# సోమవరంలో ఘనంగా బేటీ బచావో - బేటీ పడావో" - ముఖ్యఅతిథిగా పాల్గొన్న జగ్గంపేట ఎమ్మెల్యేజ్యోతుల నెహ్రూ




**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 18:**కాకినాడ జిల్లా కిర్లంపూడి మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ ఎం. పూర్ణిమ ఆధ్వర్యంలో కిర్లంపూడి మండలంసోమవరం గ్రామంలో "బేటీ బచావో – బేటీ పడావో" కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే,టిటిడి దేవస్థానం సభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరయ్యారు. ముందుగా కొబ్బరి మొక్కలు నాటి అనంతరం గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించి అత్యంత ఘనంగా శ్రీమంతం నిర్వహించారు. పిల్లలకు అన్నప్రాసరణ ఎమ్మెల్యే చేతుల మీదుగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ"ఒక అమ్మాయిని చదివిస్తే ఒక కుటుంబం వెలుగుతుంది. ఒక అమ్మాయిని కాపాడితే ఒక సమాజం బతుకుతుంది" అంటూ ప్రసంగం ప్రారంభించారు.

రాష్ట్ర ప్రభుత్వం అమ్మాయిల భద్రత, ఆరోగ్యం, విద్య, పోషణ, స్వయం ఉపాధి సాధికారత కోసం అనేక పథకాలు అమలు చేస్తుందని చెప్పారు.సాధికారత అంటే కేవలం ఉద్యోగం చేయడమే కాదు. అది మంచి చదువు, మంచి ఆరోగ్యం, తమ హక్కులపై అవగాహన, ధైర్యంగా నిర్ణయాలు తీసుకునే శక్తి, ఆర్థిక స్వాతంత్ర్యం మరియు సమాజంలో గౌరవంగా జీవించే హక్కు. ప్రతి ఆడపిల్లకు ఈ అవకాశాలు అందించడం మనందరి కర్తవ్యం" అని స్పష్టం చేశారు.ఈరోజు మనం ఎదుర్కొంటున్న రెండు పెద్ద సమస్యలు ఒకటి పర్యావరణ కాలుష్యం, రెండు ఆడపిల్లలపై వివక్ష. మొక్కలు మనకు ప్రాణవాయువు ఇస్తాయి, భూగర్భ జలాలను పెంచుతాయి. ఆడపిల్లలు సమాజానికి ప్రాణం పోస్తారు. మొక్కలు నాటడమే కాదు, వాటిని బ్రతికించే బాధ్యత కూడా మనదే" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి తోట రవి, వీరవరం సొసైటీ చైర్మన్ తోట గాంధీ, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, జంపన సీతారామచంద్ర వర్మ, గంగిరెడ్ల దొరబాబు, జంపన రవి వర్మ, ఎల్ మంచికంటి శ్రీను, సూతి శ్రీను, జ్యోతుల కోటేశ్వరావు, సూపర్వైజర్లు కరీమున్నిషా, సునీత, బుసమ్మ మరియు గ్రామ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వచ్ఛ, హరిత పట్టణంగా ఏలేశ్వరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతా: ఎమ్మెల్యే సత్య ప్రభ.





✸ ఏలేశ్వరం మున్సిపాలిటీలో సమీకృత ఘన వ్యర్థాలు నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే.
✸ ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో కార్యక్రమం ప్రారంభం.

**ఏలేశ్వరం, పెన్ పవర్, జూలై 18:** స్వచ్ఛ భారత్ మిషన్ 2. లో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ సంయుక్తంగా చేపట్టిన కార్యక్రమాల ద్వారా ఏలేశ్వరం పట్టణాన్ని అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతానని ప్రత్తిపాడు శాసనసభ్యురాలు వరుపుల సత్యప్రభ అన్నారు.

ఏలేశ్వరం మున్సిపాలిటీలో సమీకృత ఘన వ్యర్థాలు నిర్వహణ కేంద్రాని ముఖ్య మంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో లాంఛనంగా ప్రారంభించగా

స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా క్వారీ ఏరియాలో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు మూది నారాయణస్వామి అధ్యక్షతన సభ శనివారం నిర్వహించారు. సుమారు 60 సెంట స్థలంలో 20వ వార్డులో 1 కోటి 52 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన తడి చెత్త, పొడి చెత్త వ్యర్థాల నుండి కంపోస్ట్ తయారీ,పొడి వ్యర్థాల నిర్వహణ కేంద్రాని ఎమ్మెల్యే సత్య ప్రభ, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో క్లస్టర్ ఇంచార్జ్ బొద్దిరెడ్డి గోపాలకృష్ణ మాట్లాడుతూఏలేశ్వరం నగర పంచాయతీని మున్సిపాలిటీగా మార్చి పట్టణాభివృద్ధికి ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్యేక కృషి చేస్తున్నారన్నారు. 35 వేల జనాభా ఉన్న ఏలేశ్వరం పట్టణానికి 16 మంది మాత్రమే సిబ్బంది ఉన్నారని, కనీసం మరో 18 మంది కార్మికులను నియమించాల్సిన అవసరం ఉందని, అలాగే 6 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పట్టణ వార్డుల్లో చెత్త సేకరణకు సుమారు 15 వాహనాలు అవసరం ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పురపాలక సంఘ కమిషనర్ ఏఎన్ జ్ఞాన ప్రకాష్ మాట్లాడుతూ రోజుకు 8 టన్నుల చెత్త అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం 15 టన్నుల సామర్థ్యం గల ప్రాసెస్ యూనిట్ను 20వ వార్డులో ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, జిల్లా ఇంచార్జ్ పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరి నారాయణ అందించిన సహకారంతో ఏలేశ్వరం పట్టణ అభివృద్ధికి, సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభించగలుగుతున్నా మన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేకంగా అభివృద్ధి చేయడానికి 10 మున్సిపాలిటీలు ఎన్నిక కాగా దానిలో ఏలేశ్వరం మున్సిపాలిటీ ఒకటి అన్నారు. పట్టణంలో స్వచ్ఛత వైపు ఒక అడుగు వేద్దాం. చెత్త కుప్పలు లేని సమాజంగా తీర్చిదిద్దుదాం అన్నారు. అలాగే పట్టణంలో హరితవనాలను పెంచి మున్సిపాలిటీని అత్యంత సుందరమైన పట్టణంగా తీర్చిదిద్దరమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ బాధ్యతలు విజయవాడ కు చెందిన ఐ వే అసోసియేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తుందన్నారు.పట్టణంలో పారిశుధ్యం పై ప్రత్యేక ప్రణాళికలు చేపడుతూ తడి పొడి వ్యర్ధాలను వేరు చేస్తూ వాటి నుండి సంపద తయారీ విధానం గా ఈ కేంద్రాలు ఉపయోగపడతా యని ఎమ్మెల్యే సత్యప్రభ తెలిపారు. దీనిలో ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేయడం, గోబర్ గ్యాస్ ప్యాంట్ నిర్వహణ, రైతులకు ఉపయోగపడే ఎరువులు తయారు చేయడం ద్వారా సంపద తయారీ కేంద్రం నిర్వహణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు అలమండ చలమయ్య,

జ్యోతుల పెదబాబు, పెంటకోట మోహన్, జొన్నాడ వీరబాబు, రుచి రమేష్, ఎండగుడి నాగబాబు, పెంద్ర శ్రీను, రాయుడు చిన్న, జొన్నాడ వీరబాబు, సామంతుల గోపి, కోట్ల కృష్ణ, కర్రోతు గాంధీ, చిక్కాల లక్ష్మణరావు, పసల సూరిబాబు, బస్వా ప్రసాద్, మైరాల కనకారావు, జిగటాపు సూరిబాబు, కిలారి రామచంద్రరావు, శంఖాన్ని బాబ్జి, వైభోగుల సుబ్బారావు, డ్వాక్రా సంఘాలు మహిళలు, ఎన్డీఏ కూటమి కార్యకర్తలు,ఉభయగోదావరి జిల్లాల స్వచ్ఛ్ ఆంధ్ర కార్పొరేషన్ కోఆర్డినేటర్ తేనె విజయబాబు, కాకినాడ పబ్లిక్ హెల్త్ డి ఈ. బ్రహ్మ తేజ, రాజమండ్రి పబ్లిక్ హెల్త్ సూపర్డెంట్ ఇంజనీర్ రత్నాకర్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏఈ జి సూర్యనారాయణ, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వినయ్ ప్రసాద్, సానిటరీ ఇన్స్పెక్టర్ జి వి ఆర్ శేఖర్, మున్సిపల్ ఆఫీస్ సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




# రైతులు ఇన్సూరెన్స్ చేయించుకోవడం వలన మేలు జరుగుతుంది.



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, జూలై, 18:**రైతులు తమ పంటకు ఇన్సూరెన్స్ చేయించుకోవడం వల్ల ఎల్ నినో ప్రభావం వల్ల మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్ అన్నారు.

మండల కేంద్రమైన ప్రత్తిపాడులో ఆత్మ వారి సౌజన్యంతో రైతులకు 2 వ రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాబర్ట్ పాల్ మాట్లాడుతూ రైతుల అందరూ వాతావరణ ఆధారిత ఇన్సూరెన్స్ వరి పంట కు ఎకరాకు 760/-, రూ పత్తి పంటకు 2000/- స్వతహా మరియు బ్యాంకులు ద్వారా మీసేవ కేంద్రాలలో నమోదు చేసుకోవడం వలన ఎల్ నో నో ప్రభావం నుంచి రైతులకు మేలు జరుగుతుందన్నారు. యూరియా కొరత రాకుండా మండలంలో ప్రతి రైతు సేవా కేంద్రాల్లో మరియు ప్రైవేట్ డీలర్స్ వద్ద ఎరువులు అందుబాటులో ఉందని రైతే స్వయంగా ఫార్మర్ ఫ్రేమ్ వర్క్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ సందర్భంగా 50% రాయితీతో మినుములు పంపిణీ చేసారు.రైతులు అపరాల సాగు చేయడం వలన అధిక ఆదాయం పొందవచ్చని డి ఆర్ సి ఏ.ఓ సంజయ్ రైతులకు తెలియజేశారు. అంతేకాకుండా ఆత్మ వారి సౌజన్యంతో రెండు రోజులు శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్ అందజేయడం జరిగినది ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్ సైంటిస్ట్ శర్మ గారు మరియుఏడిఏ శ్రీనివాస్ గారు ,మండల వ్యవయ అధికారి జోకా అమృత, సత్యనారాయణ,వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# అంగన్వాడీ ఆయా పోస్టుకు కొమ్ముకూరి సుధ లోవరాజు కు నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

గండేపల్లి జూలై 18 జగ్గంపేట ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ టీచర్, ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు, యూనిఫామ్ చీరల పంపిణీ కార్యక్రమం జగ్గంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా గండేపల్లిమండలం గండేపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడీ ఆయా పోస్టుకు స్థానిక నాయకుల సహకారంతో ఎంపికైన కొమ్ముకూరి సుధ లోవరాజు కు గండేపల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు బొల్లంరెడ్డి రామకృష్ణ సమక్షంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వయంగా నియామక పత్రం, యూనిఫామ్ చీరను అందజేశారు.

మహిళా, శిశు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పేర్కొన్నారు. అంగన్వాడీ సిబ్బంది గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించే సేవల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు.

తమకు ఉపాధి కల్పించినందుకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కంటిపూడి రామయ్య, మాచిన బాబురావు, పైల వెంకన్న, చిటికెల కన్నబాబు, నాళం వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



## అన్నవరంలో వైభవంగా శ్రీ సత్యదేవుని రథ సేవ





**అన్నవరం (పెన్ పవర్), జూలై 18:**ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి సన్నిధిలో 'శ్రీ సత్యదేవుని రథ సేవ' అత్యంత వైభవంగా నిర్వహించారు. కొండపై కొలువైన సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో ఈ వేడుక కనులపండువగా సాగింది.ఈ విశేష వేడుకలో భాగంగా ఆలయ అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను వివిధ రకాల సుగంధభరితమైన పుష్పాలతో, నయనమనోహరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథ వాహనంపై ఆశీనులను చేశారు.

వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ, భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయ ప్రాంగణం చుట్టూ రథ సేవ ప్రదక్షిణ అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. రథం కదులుతుండగా భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పెద్ద సంఖ్యలో పాల్గొన్న అధికారులు, భక్తులు ఈ పవిత్ర కార్యక్రమంలో దేవస్థానం ఉన్నతాధికారులు, పాలకమండలి సభ్యులు, ఆలయ సిబ్బంది ప్రత్యేక పర్యవేక్షణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, వ్రత పురోహితులు వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామస్థులతో పాటు, సుదూర ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తారక మంత్రాలు పఠించారు. దేవస్థానం వారు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు.

## మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణపై అంగన్వాడీ సిబ్బందికి అవగాహన సమావేశం





**చింతూరు, పెన్ పవర్, జూలై 18:** అంగన్వాడీ వర్కర్లు, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బందితో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మహిళల భద్రత, శక్తి యాప్ వినియోగం, సైబర్ నేరాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలన, బాల్య వివాహాల అరికట్టడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో చింతూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గోపాల్ కృష్ణ, మహిళా పోలీస్ స్టేషన్ సీఐ కన్నప్ప రాజు, చింతూరు ఎస్ఐ సంతోష్ కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లతాశ్రీ, చింతూరు సీడీపీఓ జయలక్ష్మి పాల్గొన్నారు. అధికారులు మాట్లాడుతూ మహిళలపై జరిగే వేధింపులు, సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్తో పాటు పోలీసుల అత్యవసర హెల్ప్లైన్ నంబర్లను వినియోగించాలని వివరించారు. అలాగే గ్రామాల్లో బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో అంగన్వాడీ సిబ్బంది, మహిళా పోలీసులు, ఐసీడీఎస్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహిళల భద్రతకు సంబంధించిన పలు సూచనలు, జాగ్రత్తలు మరియు అత్యవసర హెల్ప్లైన్ సేవలపై అధికారులు అవగాహన కల్పించారు.ు

## తిరువూరు ఆర్డీవో,నుకలసిన,నిర్వాసితులు

- టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు,బొర్రా నరేష్,కుమార్,
- టిడిపిపార్టీ,సీనియర్,నాయకులు,బి.నరసింహారావు




**వి.ఆర్.పురం పెన్.పవర్.జూలై.18:**పోలవరం ప్రాజెక్టు,కారణంగా సర్వంకోల్పోతున్న, వి.ఆర్.పురం నిర్వాసితులు,మరియు టిడిపిపార్టీ మండలఅధ్యక్షులు, బొర్రానరేష్,కుమార్,టిడిపిపార్టీ, సీనియర్, నాయకులు బొర్రానరసింహారావు,శనివారం తిరువూరు ఆర్డీవో,ఏ.కుమార్,కలిసివి.ఆర్.పురం గ్రామనిర్వాసితులకు,తిరువూరు,ఆర్.అండ్.ఆర్. పునరావాస,కాలనీ,స్థలాలుమాఅందరికీ ఆమోదం గాఉన్నాయని,గంపలగూడెం మండలంలోని,పెను గొలనుగ్రామంలో, ఇటీవలచూపించిన,భూములు, నివాసయోగ్యంగారైతులకు అన్నివిధాలుగా ఉప యోగపడేలాఉన్నాయని,ఆ భూములను,మాగ్రా మంనిర్వాసితులకు, కేటాయించాలని,కోరారు. మండలంలోని కొంతమంది,స్వార్థపరులు,స్వార్థం కోసం తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని,వి.ఆర్.పురం గ్రామ,నిర్వాసితులు ఆరోపించారు.ఇలాంటి,తప్పుడు ప్రచారాలు, మానుకోవాలని,గ్రామనిర్వాసితులు,హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్,బొర్రానరసింహారావు,సూరి,శ్రీధర్,అప్పాజీ,తదిత రులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**రావులపాలెం పెన్ పవర్ జూలై 18:**ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని సత్వరమే పరిష్కరించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం రావులపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, రెవెన్యూ అంశాలు, పింఛన్లు, రేషన్ కార్డులు, గృహ నిర్మాణం, తాగునీటి సమస్యలు, డ్రైనేజీ, రహదారులు, విద్యుత్, ఆరోగ్య సేవలు, సంక్షేమ పథకాల అమలుకు సంబంధించిన మొత్తం 18 వినతులను ఎమ్మెల్యేకు అందజేశారు. ప్రతి వినతిని ఎమ్మెల్యే స్వయంగా పరిశీలించి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను కూడా నిర్దేశిత గడువులోగా పరిష్కరించి బాధితులకు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీకి ప్రాధాన్యత ఇస్తామని, ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా అధికారులు స్పందించాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావించి పనిచేస్తోందని ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, రహదారుల అభివృద్ధి, విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అన్ని రంగాల్లో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకునేలా ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు ప్రభుత్వంపై మరింత నమ్మకం పెరుగుతోందని, ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.

## వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు.. స్వచ్ఛతే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు






**రావులపాలెం పెన్ పవర్ జూలై 18:**పరిశుభ్రమైన పరిసరాలే ప్రజారోగ్యానికి నిజమైన రక్షణ కవచమని, ఘన, జీవ, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం సమాజానికి పెను ముప్పుగా మారుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఊబలంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని వ్యర్థాల నిర్వహణపై అధికారులకు, వైద్య సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు.

ముందుగా ఆసుపత్రిలో వైద్య వ్యర్థాల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన నాలుగు రంగుల ప్రత్యేక డబ్బాలను పరిశీలించిన ఎమ్మెల్యే, జీవ వ్యర్థాలు, ఘన వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో వేరు చేసి నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. ఆసుపత్రుల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను నిర్లక్ష్యంగా పారవేస్తే నేల, నీరు, గాలి కలుషితమై ప్రజల్లో అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. అనంతరం నిర్వహించిన స్వచ్ఛత ప్రతిజ్ఞలో పాల్గొని, పరిశుభ్రతను ఒక అలవాటుగా మార్చుకోవాలని సూచించారు.పీహెచ్సీలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ, వ్యర్థాల నిర్వహణ కేవలం పారిశుద్ధ్య కార్మికుల బాధ్యత మాత్రమే కాదని, వైద్యులు, సిబ్బంది, ప్రజలు అందరూ కలిసి బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రి ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, వ్యర్థాల సేకరణ, నిల్వ, తరలింపు, రీసైక్లింగ్ ప్రక్రియలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని ఆదేశించారు.

ప్రభుత్వ ఆసుపత్రులు పేద ప్రజలకు ఆశాకిరణాలుగా నిలుస్తున్నాయని, ఇక్కడికి వచ్చే ప్రతి రోగికి సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందించడం వైద్యుల బాధ్యత అని అన్నారు. వైద్య వృత్తి సేవాధర్మమని, ప్రజలు వైద్యులను దేవుడితో సమానంగా భావిస్తారని, ఆ నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి వైద్యుడు, ప్రతి సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని సూచించారు.ప్రభుత్వ ఉద్యోగులకు ఉన్న భద్రతను ప్రజాసేవకు వినియోగించాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కొరత, పరికరాల అవసరం లేదా ఇతర సమస్యలు ఉంటే వెంటనే ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఆరోగ్య సేవల నాణ్యత పెంపుతో పాటు పరిశుభ్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమం ద్వారా పరిశుభ్రమైన గ్రామాలు, ఆరోగ్యవంతమైన ప్రజలు, కాలుష్య రహిత వాతావరణం సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు.

## డొక్కా సీతమ్మ సేవా స్ఫూర్తి చిరస్మరణీయం..

చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం: ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**రావులపాలెం పెన్ పవర్ జూలై 18**:తోటి మనిషి కష్టాన్ని తన కష్టంగా భావించి పేదలకు అండగా నిలవడం గొప్ప మానవతా ధర్మమని, అలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్న సంస్థలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెంలో నిర్వహించిన డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ నాలుగో వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ట్రస్ట్ సేవలను కొనియాడారు.

రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, సామాజిక సేవకుడు ఆకుల రామకృష్ణతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు మహాన్నదాత డొక్కా సీతమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం, వస్త్రదానం, నిత్యావసర సరుకులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రావులపాలెం అంటేనే సేవా సంస్థలకు చిరునామాగా నిలిచిందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా అన్నపూర్ణగా గుర్తింపు పొందిన మహోన్నతురాలు డొక్కా సీతమ్మ ఈ ప్రాంతానికి ఎనలేని కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారని కొనియాడారు. ఆకలితో అలమటించే వారికి కులమతాలకు అతీతంగా అన్నం పెట్టిన ఆమె సేవలు తరతరాలకు ఆదర్శమని పేర్కొన్నారు.డొక్కా సీతమ్మ స్ఫూర్తితో 2022లో చారిటబుల్ ట్రస్ట్ను స్థాపించి, నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ నాలుగో వార్షికోత్సవాన్ని జరుపుకోవడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. ట్రస్ట్ నిర్వాహకుడు రాజేష్తో పాటు సభ్యులంతా సమాజ సేవను లక్ష్యంగా చేసుకుని పేదలకు అండగా నిలుస్తున్న తీరు ప్రశంసనీయమని చెప్పారు. విద్య, వైద్యం, ఆహారం, నిత్యావసర వస్తువుల పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా ఎందరో నిరుపేదలకు చేయూతనందిస్తున్నారని పేర్కొన్నారు.రాష్ట్రంలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకానికి కూడా డొక్కా సీతమ్మ పేరు పెట్టడం ఆమె సేవలకు ప్రభుత్వం ఇచ్చిన గౌరవానికి నిదర్శనమని ఎమ్మెల్యే గుర్తు చేశారు. పేదలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం ఆరోగ్యవంతంగా ఉంటుందని, అలాంటి లక్ష్యంతో సేవ చేస్తున్న డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.సేవ అనేది దానం చేయడం మాత్రమే కాదని, అవసరంలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమాజంలో మరింత మంది సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిస్తూ, ఇలాంటి సేవా సంస్థలకు ప్రభుత్వం తరపున ఎల్లప్పుడూ సహకారం అందుతుందని హామీ ఇచ్చారు.

# మందపల్లి దేవస్థానంలో అభివృద్ధి పనులపై కమిషనర్ హర్షం






**2027 పుష్కరాల నాటికి భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు: కె. రామచంద్ర మోహన్**

**కొత్తపేట, పెన్ పవర్, జూలై18:**డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లిలోని ప్రసిద్ధ శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామివారి దేవస్థానంలో 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని చేపడుతున్న అభివృద్ధి పనులను ఆంధ్రప్రదేశ్ దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ కె. రామచంద్ర మోహన్ శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉదయం దేవాలయానికి చేరుకున్న ఆయన తొలుత నిర్మాణంలో ఉన్న తైలాభిషేక మండపం, అన్నప్రసాద భవన నిర్మాణ ప్రాంతాలను సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేస్తూ, నిర్మాణ నాణ్యతలో రాజీ లేకుండా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.అనంతరం అన్నప్రసాద భవనంలో భక్తులకు స్వయంగా ప్రసాదాన్ని వడ్డించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. భక్తులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్, ఆలయంలో జరుగుతున్న మార్పులు ప్రశంసనీయమన్నారు.తదుపరి మీడియా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, ధర్మకర్తల మండలి సభ్యులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, గతంతో పోలిస్తే దేవస్థానం రూపురేఖలు గణనీయంగా మారాయని పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తైలాభిషేక మండపం, అన్నప్రసాద భవనం పూర్తయితే పుష్కరాల సందర్భంగా వచ్చే భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు అందుతాయని, భక్తుల రద్దీ కూడా గణనీయంగా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అనంతరం శ్రీ మందేశ్వర స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ఆలయ అభివృద్ధికి సంబంధించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

ఈ పర్యటనలో దేవదాయ శాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ వేంద్ర త్రినాధరావు, డిప్యూటీ కమిషనర్ డి.ఎల్.వి. రమేశ్‌బాబు, జిల్లా దేవదాయ శాఖ అధికారి వి. సత్యనారాయణ, సూపరింటెండింగ్ ఇంజినీర్ టి. దుర్గేశ్ కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, డిప్యూటీ ఇంజినీర్ ఎన్. ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు గంధం సత్య వెంకట నాగాజీ, దంగేటి సాయి నాగ భూషణం,గవర వీర వెంకట సత్యనారాయణ, చిలకమర్తి అనంతలక్ష్మి సావిత్రి (శ్రీనివాస్),నేరేడుమిల్లి మహాలక్ష్మి (ఏడుకొండలు) మాజీ చైర్మన్ చింతం విజయకృష్ణ మోహన్‌రావు, మాజీ చైర్మన్, ఎంపీటీసీ సభ్యుడు సిద్ధంశెట్టి వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




## స్వర్గీయ మాజీ మంత్రి ముద్రగడ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి.

-ముద్రగడ సమాధి వద్ద క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ప్రత్యేక ప్రార్థనలు.






**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 18:** స్వర్గీయ మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత, ప్రజా శ్రేయోభిలాషి ముద్రగడ పద్మనాభం పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని జగ్గంపేట నియోజకవర్గానికి చెందిన పలువురు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ముద్రగడ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ముందుగా ఆయన చిత్ర పటానికి, సమాధి వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ మృతి వారి కుటుంబానికే కాకుండా, రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు తీరని లోటని పలువురు సంఘ ప్రతినిధులు అన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా ముద్రగడ కుమారులు ముద్రగడ వీరారాఘవరావు (బాలు), ప్రత్తిపాడు నియోజకవర్గం వైసిపి ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబులను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కె జాన్ వెస్లీ, రెవరెండ్, ఎం నాగభూషణం,జుత్తుక నాగేశ్వరావు,డి ప్రసాదరావు, కె సంతోష్ కుమార్, ఎస్ నేరేంద్ర, పి రాజు,ఎస్ రఘుయేల్, ఎస్ వెంకటరత్నం, కె యేసురాజు, ఎస్ సమర్పణ అధిక సంఖ్యలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి,ముద్రగడ ఇచ్చిన మాటకు కట్టుబడే గొప్ప వ్యక్తి.

-ఎమ్మెల్యే వనమాడి, ఎమ్మెల్సీ, పేరా బత్తుల, మాజీ ఎమ్మెల్యే, ఎస్.వి.ఎస్.ఎన్ వర్మ.





**కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 18 :** స్వర్గీయ మాజీ మంత్రి, కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం ఇచ్చిన మాటకు కొట్టుబడే గొప్ప వ్యక్తి ముద్రగడ పద్మనాభం అని అటువంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం దురదృష్టకరమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే,వనమాడి కొండబాబు, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. శనివారం ముద్రగడ కుమారులు ముద్రగడ వీర రాఘవరావు (బాలు) ప్రత్తిపాడు నియోజకవర్గం ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు లను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు. అనంతరం ముద్రగడ చిత్రపటానికి, సమాధి వద్ద పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ ఎమ్మెల్యేగా,మంత్రిగా, పార్లమెంట్ సభ్యునిగా అనేక పదవులు చేపట్టి అనేక అభివృద్ధి,సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఒక కాపు ఉద్యమమే కాకుండా, అనేక ప్రజా ఉద్యమాలు చేపట్టి ఉద్యమ నేతగా గుర్తింపు పొందారన్నారు. అటువంటి వ్యక్తి మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థించారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు.

## స్వల్పకాలిక రకాలే మేలు




**శంఖవరం పెన్ పవర్ జూలై 18:-** వరిసాగులో స్వల్పకాలిక రకాలు మాత్రమే సాగు చేయడం ద్వారా ఎల్నినో ప్రభావం నుంచి తప్పించుకోవచ్చని వ్యవసాయ అధికారి పి. గాంధీ రైతులకు సూచించారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం లో అరెంపూడి,అన్నవరం గ్రామాల్లో రైతులకు

ఎల్నినో ప్రభావం గూర్చి అవగాహన కల్పించారు. రైతులతో ఈ పంట కాలంలో వరిలో స్వల్పకాలిక రకాలైన ఆర్.ఎన్.ఆర్ 15048, ఎన్. ఎల్.ఆర్.34449 వంటి రకాలు,ఆరుతడి పంటల సాగు, చిరు ధాన్యాలు సాగు,ప్రధాన మంత్రి పంటల బీమా పథకం, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం వంటి అంశాలపై చర్చించారు. వ్యవసాయ సహాయకుడు జగదీష్, రైతులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి, ముద్రగడ కుటుంబానికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పరామర్శ.

- ముద్రగడ చిత్రపటానికి ఘన నివాళులు.





**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 18:**మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత,స్వర్గీయ ముద్రగడ పద్మనాభం మృతికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సంతాపం వ్యక్తం చేశారు.కిర్లంపూడిలోని ముద్రగడ నివాసానికి టిడిపి నాయకులతో చేరుకున్న ఆమె,ముద్రగడ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ముద్రగడ కుటుంబ సభ్యులను పరామర్శించిఎమ్మెల్యే సత్యప్రభ ఆయన కుమారులు ముద్రగడ బాలు,గిరిబాబులకు ధైర్యం చెప్పారు.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన ముద్రగడ పద్మనాభం సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.రాజకీయ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ముద్రగడ పద్మనాభం ప్రజల మనసుల్లో నిలిచిపోతారని అన్నారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ,రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మూది నారాయణ స్వామి,నియోజకవర్గ సిబిఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ల జగదీష్,ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి,ఏలేశ్వరం పట్టణ నాయకులు బొదిరెడ్డి గోపి,నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కీర్తి వెంకట సుభాష్,ప్రత్తిపాడు సిహెచ్సి వర్కింగ్ కమిటీ చైర్మన్,వైస్ చైర్మన్లు వెలుగుల నాని,బొల్లు వెంకటేశ్వరరావు,తదితరులు ముద్రగడకు ఘన నివాళులర్పించారు.

# భారత్ అంతరిక్ష రంగంలో మరో చారిత్రాత్మక విజయం

- 'విక్రమ్-1' విజయంతో దేశ ప్రతిష్ఠ మరింత పెరిగింది
- మంత్రి వాసంశెట్టి సుభాష్

**రామచంద్రపురం/అమరావతి, జూలై 18 పెన్ పవర్:**భారతదేశం అంతరిక్ష రంగంలో మరో కీలక విజయాన్ని నమోదు చేసుకోవడం ప్రతి భారతీయుడికి గర్వకారణమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.స్వదేశీ సాంకేతికతతో ప్రైవేట్ అంతరిక్ష రంగం అభివృద్ధి చేసిన 'విక్రమ్-1' రాకెట్ తొలి ప్రయోగం విజయవంతం కావడం భారత శాస్త్ర సాంకేతిక సామర్థ్యానికి నిదర్శనమని ఆయన అన్నారు.

శనివారం విడుదల చేసిన ప్రకటనలో మంత్రి మాట్లాడుతూ,భారత యువ శాస్త్రవేత్తల ప్రతిభ,పట్టుదల, ఆవిష్కరణాత్మక ఆలోచనలకు ఈ విజయం ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రభుత్వ సంస్థలతో పాటు ప్రైవేట్ సంస్థలు కూడా అంతరిక్ష రంగంలో విశేషంగా రాణించగలవని ఈ ప్రయోగం మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ అంతరిక్ష రంగానికి కొత్త దిశ లభించిందని, ఇస్రో , ఇన్-స్పేస్ , ఎన్ఎస్ఐఎల్ వంటి సంస్థల సహకారంతో ప్రైవేట్ రంగానికి విస్తృత అవకాశాలు కల్పించడం వల్లే ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని మంత్రి వివరించారు.'విక్రమ్-1' ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసిన స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులు, ప్రాజెక్టులో భాగమైన ప్రతి ఒక్కరికీ మంత్రి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.భారతదేశం అంతరిక్ష రంగంలో ప్రపంచ అగ్రదేశాలతో పోటీపడుతున్న ఈ సమయంలో యువత శాస్త్ర, సాంకేతిక రంగాలపై మరింత ఆసక్తి పెంపొందించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. విజ్ఞానం, సాంకేతికతే దేశాభివృద్ధికి ప్రధాన చోదకశక్తులని పేర్కొంటూ, భవిష్యత్తులో భారతదేశం అంతరిక్ష పరిశోధనల్లో మరిన్ని అద్భుత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.'విక్రమ్-1' విజయంతో భారత జెండా అంతరిక్ష రంగంలో మరింత ఎత్తుకు ఎగిరిందని, ఇది కేవలం రాకెట్ ప్రయోగం విజయం మాత్రమే కాకుండా



'ఆత్మనిర్భర్ భారత్' సంకల్పానికి ప్రతీక అని మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు.

## ఆసుపత్రిలో జేసీ అపూర్వ భరత్ ఆకస్మిక తనిఖీ



**కాకినాడ, పెన్ పవర్ జూలై 18:** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ, ఐసీయూ, ఈఆర్ఐసీయూ వార్డులు, ఎక్సరే, ఎంఆర్ఐ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, పారిశుద్ధ్య నిర్వహణ, మరుగుదొడ్లలో సౌకర్యాలు, మందుల లభ్యతపై జేసీ అధికారులను వివరంగా అడిగి తెలుసుకున్నారు. ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి, వైద్య సేవలు, సదుపాయాల పట్ల వారి సంతృప్తిని, ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎస్ లావణ్య కుమారి, ఇతర వైద్య అధికారులు, వివిధ విభాగాల అధిపతులతో జేసీ అపూర్వ భరత్ ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంలో ఏమాత్రం రాజీ పడకూడదని స్పష్టం చేశారు. పారిశుద్ధ్య నిర్వహణను మరింత మెరుగుపరచాలని స్పష్టం చేశారు. వివిధ వార్డులో ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్య అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను రోగులకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని జేసీ అపూర్వ భరత్ వైద్య సిబ్బందికి సూచించారు.

ఈ పరిశీలనలో జేసీ వెంట జీజీహెచ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్ శ్రీధర్, అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసన్, వివిధ విభాగాల అధిపతులతో, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ ఆశయ సాధనకు ఐక్యంగా కృషి చేయాలి




**కాకినాడ, జూలై 18 ,పెన్ పవర్:** కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి దివంగత ముద్రగడ పద్మనాభం ఆశయాలను సాకారం చేసేందుకు అన్ని వర్గాలు ఐక్యంగా కృషి చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. రాజ్యాధికార సాధన కోసం ఎస్సీ, బీసీ వర్గాలను కలుపుకుని ముందుకు సాగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. శనివారం కాకినాడలోని శుభం కాపు కళ్యాణ మండపంలో ఆంధ్ర కాపు సద్భావన సంఘం ఆధ్వర్యంలో పార్టీలకు అతీతంగా నిర్వహించిన ముద్రగడ సంతాప సభలో పలువురు నాయకులు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముద్రగడ మరణాన్ని రాజకీయాలకు వినియోగించవద్దని, ఆయన ఆశయ సాధన కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి ఉద్యమాన్ని కొనసాగించాలని సూచించారు. విజయవాడలో రాష్ట్రస్థాయి సంతాప సభ నిర్వహించాలని, ముద్రగడకు చిరస్థాయిగా గుర్తుండే విధంగా మహోన్నత కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కాకినాడ జిల్లాలో కాపు సామాజిక వర్గం అధికంగా ఉన్నందున జిల్లాకు ముద్రగడ పద్మనాభం పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ముద్రగడ విగ్రహాలు ఏర్పాటు చేసి ఆయన సేవలను చిరస్మరణీయంగా నిలపాలని అభిప్రాయపడ్డారు. 1978లో ఎమ్మెల్యేగా ఎన్నికైన ముద్రగడ పద్మనాభం నీతి, నిజాయితీ, ముక్కుసూటితనంతో రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందారని, అదే కారణంగా ఎన్నో ఉన్నత పదవులను కోల్పోయారని వక్తలు పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల్లో ముద్రగడపై అనవసర వ్యాఖ్యలు చేయవద్దని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు,మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు,ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు, కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్, బీసీ సంఘం నాయకుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు, బూరిగా ఆశీర్వాదం,ఆకుల రామకృష్ణ, కల్వకొలను తాతాజీ,బుర్ర అనుబాబు, రామదేవు సీతయ్య దొర,బీఎన్ మూర్తి, తుమ్మలపల్లి రమేష్,రామిరెడ్డి మురళి, రాగిరెడ్డి చంద్రకళ దీప్తి,పెద్దాడ సుబ్బారాయుడు,దుగ్గన బాబ్జి, అడ్డాల లక్ష్మి, మజ్జి పద్మావతి, కుంపట్ల మంగతాయారు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# కూటమి పాలనపై బహిరంగ చర్చకు సిద్ధం

**మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ**



**కాకినాడ, జూలై 18 పెన్ పవర్:** కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి, తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. నైతిక విలువలు లేని రాజకీయాలు చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు తొలినాటి నుంచే అలవాటని ఆయన విమర్శించారు. ఇటీవల అనపర్తి నియోజకవర్గంలోని రామవరం గ్రామంలో కూటమి నాయకుల దాడిలో గాయపడిన వైసీపీ నాయకుడు నందిక సత్యనారాయణను శనివారం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి,ఆయన కుమారుడు మనోజ్‌రెడ్డి నేతృత్వంలో వైసీపీ నాయకులపై భౌతిక దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. తాను,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి పరామర్శకు వస్తున్న విషయం తెలుసుకుని పోలీసుల ద్వారా సత్యనారాయణను కాకినాడకు తరలించారని, అనంతరం నామమాత్రపు వైద్య సేవలు అందించి ఇంటికి పంపించారని ఆరోపించారు. అనపర్తి ఎమ్మెల్యే తన పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమని చేసిన సవాల్‌ను స్వీకరిస్తున్నట్లు వేణుగోపాలకృష్ణ ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తిసూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనపర్తి నియోజకవర్గంలో భౌతిక దాడులు పెరిగాయని ఆరోపించారు. ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు మనోజ్‌రెడ్డి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని,పోలీసులను ఉపయోగించి ప్రత్యర్థులపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇలాంటి చర్యలు కొనసాగితే సహించబోమని హెచ్చరించారు. పరామర్శకు వెళ్లిన సమయంలో ఆసుపత్రి అత్యవసర విభాగం గేట్లు మూసి ఉండటంపై వేణుగోపాలకృష్ణ,సూర్యనారాయణ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అత్యవసర విభాగం హెచ్‌వోడీ డాక్టర్ కె. సత్యవాణిని కలిసి సత్యనారాయణకు అందిస్తున్న వైద్యసేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ సత్యవాణి మాట్లాడుతూ రోగికి అవసరమైన అన్ని వైద్య సేవలు అందించామని, ఆప్తాల్మాలజీ, న్యూరో, ప్లాస్టిక్ సర్జరీ తదితర సూపర్ స్పెషాలిటీ వైద్యులు పరీక్షలు నిర్వహించారని తెలిపారు. అవసరమైన చికిత్స, మందులు అందించామని,ప్లాస్టిక్ సర్జరీ విభాగంలో అడ్మిషన్ ప్రక్రియ చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పెదపూడి వైసీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నార్ల శ్రీనివాస్, వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు నొక్కి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## తాళ్లూరు లిఫ్ట్ పనులు శరవేగం వాతావరణం అనుకూలిస్తే ఆగస్టు 15కి మొదటి పైప్‌లైన్ పూర్తి

**తాళ్లూరు లిఫ్ట్ రెండోసారి పనుల పరిశీలనలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**





**గండేపల్లి, పెన్ పవర్, జూలై ,18** గండేపల్లి మండలం తాళ్లూరు వద్ద నిర్మిస్తున్న పుష్కర అంతర్భాగం తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ రెండోసారి పర్యవేక్షించారు.

52 కోట్ల రూపాయలతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనులు యుద్ధప్రాతిపదికన జరుగుతున్నాయి. శనివారం అధికారులు, నాయకులతో కలిసి పైప్‌లైన్ పనులను స్వయంగా దగ్గరుండి పరిశీలించారు. వర్షం కారణంగా బురదగా మారిన పైప్‌లైన్ మార్గంలో పోలీస్ జీపులో ప్రయాణిస్తూ పనుల పురోగతిని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ:

“పనులు శరవేగంగా సాగుతున్నాయి. అయితే 15 రోజులు వెనకబడ్డాం. వాతావరణం అనుకూలిస్తే వచ్చే 15 రోజుల్లో 1600 మీటర్ల పైప్‌లైన్ పూర్తి చేస్తాం. ఐరన్ పైపులకు లోపల, బయట కవరింగ్ తప్పనిసరిగా చేయాలి. ఆగస్టు 15 నాటికి మొదటి పైప్‌లైన్, సెప్టెంబర్ నాటికి రెండో పైప్‌లైన్ పూర్తి చేసేలా మెగా కంపెనీని ఆదేశించాం” అని తెలిపారు.


గత ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే 52 కోట్లు కేటాయించి పనులు వేగవంతం చేశామని చెప్పారు. 31 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులపై ఉన్న చిత్తశుద్ధితో వెంటనే సాంక్షన్ చేయించారని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పుష్కర ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్, అడబాల భాస్కరరావు, రాష్ట్ర కమ్మ, ఆర్యవైశ్య డైరెక్టర్లు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, ఎస్వీఎస్ అప్పలరాజు, రేఖ బుల్లి రాజు, జాస్తి వసంత్, యర్రం శెట్టి బాబ్జి, ఉప్పలపాటి బుల్లబులు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## మందపల్లి శనేశ్వరుడికి రూ.2.81 లక్షల ఆదాయం

**36.8 కిలోల నువ్వుల తైలంతో తైలాభిషేకాలు.. విదేశాల నుంచే ఆన్‌లైన్‌లో భక్తుల సేవలు**



**కొత్తపేట, పెన్ పవర్, జూలై 18:** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మందపల్లిలోని ప్రసిద్ధ శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామివారి దేవస్థానంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. శనిదోష నివారణ కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో తైలాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.

దేవస్థానం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ముఖమండపం, ఏకాదశ రుద్ర తైలాభిషేకం, మహాన్యాస పూర్వక తైలాభిషేకం, తైలం సమర్పించి దర్శనం, తిలదానం, స్వయంహోమం, కేశఖండనం ద్వారా రూ.1,15,760 ఆదాయం లభించింది. అలాగే ఫోన్‌పే ద్వారా రూ.28,395, పరోక్ష పూజల ద్వారా రూ.1,05,200, అన్నప్రసాద విరాళాల రూపంలో రూ.31,492 అందడంతో శనివారం ఒక్కరోజే దేవస్థానానికి మొత్తం రూ.2,80,847 ఆదాయం సమకూరినట్లు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు. శనివారం ఆన్లైన్ సేవలలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో మొత్తం 36 కిలోల 800 గ్రాముల నల్లనువ్వుల తైలంతో శ్రీ స్వామివారికి ఘనంగా తైలాభిషేకాలు నిర్వహించారు. అర్చకులు భక్తుల గోత్రనామాలను ఉచ్చరిస్తూ శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించగా ఆలయం భక్తి పారవశ్యంతో మార్మోగింది.


ఆలయంలో అమలు చేస్తున్న ఆధునిక ఆన్‌లైన్ సేవలకు విశేష స్పందన లభిస్తోంది. కెనడా,అమెరికా, లండన్ తదితర దేశాల్లో నివసిస్తున్న భక్తులు ప్రత్యక్ష ప్రసారం ద్వారా స్వామివారి తైలాభిషేకాలను వీక్షిస్తూ పూజల్లో పాల్గొని భక్తి పరవశం పొందుతున్నట్లు ఆలయ వర్గాలు వెల్లడించాయి. గతంతో పోలిస్తే ఆలయ సేవలు సాంకేతికంగా ఆధునీకరించబడటంతో దేశ విదేశాల్లోని భక్తులకు సైతం స్వామివారి సేవలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఈ విధంగా ఆన్‌లైన్ ద్వారా తైలాభిషేకాలు,పూజా కార్యక్రమాలను నిర్వహించే విధానం శ్రీ మందేశ్వర (శనేశ్వర) స్వామివారి ఆలయంలో విశేష ఆదరణ పొందుతోందని సహాయ కమిషనర్,కార్యనిర్వహణాధికారి దారపురెడ్డి సురేష్‌బాబు పేర్కొన్నారు. 2027 గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులతో పాటు ఆధునిక సేవల విస్తరణ కూడా భక్తులకు మరింత సౌలభ్యం కల్పిస్తోందని ఆయన తెలిపారు.

# స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర మనందరి బాధ్యత.

–పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించిన సూర్యచంద్ర

కిర్లంపూడి, పెన్ పవర్, జూలై 18:

స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి సూర్యచంద్ర పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే కార్యక్రమాన్ని పురస్కరించుకుని కిర్లంపూడి మండలం సోమవరం గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని పలు ప్రాంతాల్లో చెత్త,మురుగునీరు,అపరిశుభ్ర పరిస్థితులను పరిశీలించారు. ఇలాంటి పరిస్థితుల వల్ల దోమలు పెరిగి డెంగ్యూ,మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తడి చెత్త,పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పంచాయతీ చెత్త సేకరణ వాహనాలకు అందించాలని కోరారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ సందర్భంగా సోమవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరిశుభ్రత,పర్యావరణ పరిరక్షణ,చెత్త వర్గీకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమ ఇళ్లలో,గ్రామంలో పరిశుభ్రత పాటించడంతో పాటు ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు. పరిశుభ్రమైన గ్రామాలే ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని,ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛాంధ్ర –స్వర్ణాంధ్ర లక్ష్యం సాధ్యమవుతుందని పాటంశెట్టి సూర్యచంద్ర పేర్కొన్నారు.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# గోవింద నామస్మరణతో మారుమోగిన కోనసీమ తిరుమల






## ఏడువారాల వెంకటేశ్వరస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు.. ప్రముఖుల ప్రత్యేక పూజలు

**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 18:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ చందన వెంకటేశ్వరస్వామి ఆలయం లో శనివారం భక్తజన సందోహంతో కిటకిటలాడింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గౌతమి గోదావరి తీరంలో పవిత్ర స్నానాలు ఆచరించి, తలనీలాలు సమర్పించిన అనంతరం క్యూలైన్ల ద్వారా స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ మాడవీధుల్లో "గోవిందా... గోవిందా..." నామస్మరణతో భక్తులు ఏడువారాల నోమును ఆచరించడంతో ఆలయ పరిసరాలు భక్తి పారవశ్యంతో మారుమోగాయి.

వేకువజామున అర్చకులు మేలుకొలుపు సేవ, సుప్రభాత సేవ, అలంకరణోత్సవం, ఐశ్వర్యలక్ష్మి హోమం తదితర నిత్యకైంకర్యాలను వేదమంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం తొలి హారతి దర్శనాన్ని భక్తులకు కల్పించారు. మంగళవాయిద్యాలు, వేదఘోషల మధ్య జరిగిన ఈ కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మొక్కులు తీర్చుకున్న భక్తులు:

సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గౌతమి గోదావరిలో పవిత్ర స్నానాలు చేసి, తలనీలాలు సమర్పించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు క్రమపద్ధతిలో స్వామివారిని దర్శించుకున్నారు. ఏడువారాల నోము ఆచరిస్తున్న భక్తులు ఆలయ మాడవీధుల్లో ఏడు ప్రదక్షిణలు చేస్తూ గోవింద నామస్మరణతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు.

ప్రముఖుల ప్రత్యేక దర్శనం:

వినుకొండ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు, పెదకూరపాడు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్మాలపాటి శ్రీధర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి వేదాశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు దుశ్శాలువతో సత్కరించి స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.

అలాగే ప్రముఖ సినీ కొరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ కూడా ఏడువారాల నోము ఆచరిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ వసంత మండపంలో అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. శేఖర్ మాస్టర్‌ను చూసేందుకు పలువురు భక్తులు ఆసక్తి కనబరిచారు.

భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం:

సాయంత్రం చాగల్లు మండలం చంద్రవరం గ్రామానికి చెందిన శ్రీ హరేకృష్ణ భక్త సమాజం ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, భజనలు, ధర్మప్రబోధ కార్యక్రమాలు నిర్వహించారు. హరినామ సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం భక్తిమయంగా మారింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధ్యాత్మిక కార్యక్రమాలను ఆస్వాదించారు.


పటిష్ఠ ఏర్పాట్లు:

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. తాగునీరు, ప్రసాదాల పంపిణీ, క్యూలైన్లు, పారిశుద్ధ్యం, విశ్రాంతి సదుపాయాలను అందుబాటులో ఉంచారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఉప కార్యనిర్వహణాధికారి నల్ల సూర్యచంద్రరావు, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు స్వయంగా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కట్టుదిట్టమైన బందోబస్తు:

భక్తుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అదనపు పోలీసు బలగాలను మోహరించింది. ఆత్రేయపురం ఎస్ఐ ఎస్. రాము ఆధ్వర్యంలో పోలీసులు ఆలయ ప్రాంగణం, గోదావరి ఘాట్‌లు, క్యూలైన్లు, పార్కింగ్ ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. ఆలయ సిబ్బంది, వాలంటీర్లు, వివిధ సేవా సంస్థల సభ్యులు భక్తులకు ఎప్పటికప్పుడు సహాయ సహకారాలు అందించడంతో దర్శనం ప్రశాంతంగా సాగింది.






03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ర్యాలి జగన్మోహిని కేశవ స్వామి ఆలయంలో భక్తుల రద్దీ

స్వామివారి నిత్య అన్నదానానికి భక్తులు విరాళం






**పెన్ పవర్ ఆత్రేయపురం జూలై 18 :** ర్యాలి గ్రామంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి శనివారం తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించిన భక్తులు ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన ప్రసాదాన్ని కూడా స్వీకరించారు. అన్నదాన కార్యక్రమానికి ర్యాలి గ్రామానికి చెందిన గోపు శ్రీనివాసరావు--వెంకట పార్వతి దంపతులు రూ.5,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి వారికి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. వేద పండితులు వెంకట అవధాని వేదాశీర్వచనం చేయగా, ఆలయ చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు స్వామివారి చిత్రపటంతో పాటు శేషవస్త్రం అందించి దంపతులను సత్కరించారు.సాయంత్రం ఆలయ సన్నిధిలో లలితా పారాయణదారుల ఆధ్వర్యంలో శ్రీలలితా సహస్రనామ పారాయణం, శ్రీ మణిద్వీప పారాయణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో ద్వారపురెడ్డి సురేష్ బాబు తెలిపారు.

# కాజులూరు సర్వసభ్య సమావేశంలో ...





## తాగునీరు, సాగునీటి సమస్యలపై అధికారులను నిలదీసిన సభ్యులు

**కాజులూరు, జూలై 18 పెన్ పవర్:** కాజులూరు మండల పరిషత్ కార్యాలయంలో మండల అధ్యక్షురాలు మాత భారతి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల సాధారణ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీడీవో జె. రాంబాబు సమావేశాన్ని నిర్వహించి వివిధ శాఖలకు సంబంధించిన తీర్మానాలను నమోదు చేశారు. శాఖల అధికారులు తమ శాఖల పనితీరు,అభివృద్ధి కార్యక్రమాలను వివరించాలని, సభ్యులు లేవనెత్తిన సమస్యలకు సమాధానాలు ఇవ్వాలని సూచించారు.మండల వ్యవసాయ అధికారి వి. అశోక్ మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సాగు ఆలస్యమైనప్పటికీ ఎరువుల కొరత లేదన్నారు. ఆగస్టు నాటికి వరి నాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు యాప్ ద్వారా ఎరువుల పంపిణీ చేస్తున్నామని, డీఏపీ అవసరం 936 మెట్రిక్ టన్నులు కాగా ప్రస్తుతం 168 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. పంటల బీమా కోసం ఎకరాకు రూ.760 చెల్లిస్తే రూ.38 వేల వరకు పరిహారం లభిస్తుందని వివరించారు. సీసీఆర్సీ కార్డులు ఈ-పంట యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఐసీడీఎస్ అధికారి మాట్లాడుతూ మండలంలో 80 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, జగన్నాథగిరి, మంజేరు తదితర గ్రామాల్లో కొత్త భవనాలకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. చిన్నారుల ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించేందుకు కొత్త యాప్‌ను వినియోగిస్తున్నామని చెప్పారు.విద్యుత్ శాఖ ఏఈ వీరెడ్డి మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ వినియోగం పెరగడంతో సమస్యలు ఎదురైనా, లో-వోల్టేజ్ సమస్యలు ఉన్న గ్రామాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని తెలిపారు.హౌసింగ్ ఏఈ ప్రసన్న కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 580 ఇళ్లు పూర్తయ్యాయని, మరో 127 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. గృహ నిర్మాణ ఆర్థిక సహాయాన్ని రూ.1.80 లక్షల నుంచి రూ.2.30 లక్షలకు పెంచినట్లు చెప్పారు. కొత్త నిబంధనల ప్రకారం అర్హత లేని లబ్ధిదారులను జాబితా నుంచి తొలగించామని వివరించారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు తమ శాఖల పురోగతిని వివరించారు. ఉపాధి హామీ పథకం కింద కూలీల వేతనాలను రూ.307 నుంచి రూ.312కు పెంచినట్లు ఏపీవో బి. వెంకటలక్ష్మి తెలిపారు. మండలంలో రెండు లక్షలకు పైగా పనిదినాలు కల్పించామని, ఇంకా 5,232 పనులు చేపట్టాల్సి ఉందని చెప్పారు. దీనిపై ఎంపీడీవో రాంబాబు మాట్లాడుతూ డెల్టా ప్రాంతమైనప్పటికీ ఉపాధి హామీ పనుల అమలులో కాజులూరు మండలం జిల్లాలో రెండో స్థానంలో నిలిచిందని పేర్కొన్నారు.

వెలుగు ఏపీఎం మురళీకృష్ణ మాట్లాడుతూ మండలంలో 45 గ్రామ సంఘాలు ఉన్నాయని, డ్వాక్రా మహిళలకు బ్యాంక్ లింకేజ్, స్త్రీనిధి, ముద్రా రుణాలు అందిస్తున్నామని వివరించారు.సమావేశంలో తాగునీటి సరఫరా, సాగునీటి సమస్యలు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై పలువురు ఎంపీటీసీ సభ్యులు అధికారులను నిలదీశారు.ఈ సమావేశంలో జెడ్పీటీసీ వనుం వెంకట సుబ్బారావు, వైస్ ఎంపీపీలు పెద్దిరెడ్డి వెంకటరమణ, రేఖాడి విజయ, ఏవో పద్మలత, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణమూర్తి,పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి ముద్రగడ మృతి రాష్ట్రానికి తీరని లోటు.



-పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు.

-ముద్రగడ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన కుమారులను



పరామర్శించిన పలువురు నేతలు.





**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై 18:**

మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత,స్వర్గీయ ముద్రగడ నివాసానికి పలువురు నేతలు చేరుకుని ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం ముద్రగడ కుటుంబ సభ్యులు ముద్రగడ బాలు,గిరిబాబులను పరామర్శించి తమ తీవ్ర ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేశారు.ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన ముద్రగడ పద్మనాభం సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.రాజకీయ రంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన ముద్రగడ పద్మనాభం ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు.ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో ఆంధ్రప్రదేశ్ మాజీ ఉపముఖ్యమంత్రి, పెద్దాపురం శాసనసభ్యులు నిమ్మకాయల చినరాజప్ప, మాజీ మంత్రులు తోట నరసింహం, గొల్లపల్లి సూర్యారావు, ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీకాకుళపు శివరామ సుబ్రహ్మణ్యం,

మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి,పెండెం దొరబాబు పర్వత బాపనమ్మ, పర్వత పూర్ణచంద్ర ప్రసాద్, వరుపుల సుబ్బారావు, జ్యోతుల చంటిబాబు,తోపాటు తోట సుబ్బారావు నాయుడు,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి పలు రాజకీయ పార్టీల నాయకులు, ముద్రగడ అభిమానులు కిర్లంపూడి తరలి వచ్చి ముద్రగడ ముద్రగడ చిత్రపటానికి సమాధి వద్ద పూలమాలలు ఉంచి ఘనంగా నివాళులర్పించారు.

# ‘బాధపడడం ఎందుకు?’.. రోహిత్ రిటైర్మెంట్ ప్రచారంపై కపిల్ దేవ్

రోహిత్ రిటైర్మెంట్‌పై జోరు ప్రచారం

దీనిపై స్పందించిన కపిల్ దేవ్

ఏదో ఒకరోజు వీడ్కోలు చెప్పక తప్పదని వ్యాఖ్య

ఇన్నేళ్లు రోహిత్ ఎంతో ఆనందం పంచాడని వెల్లడి


అతడి రిటైర్మెంట్‌ను సెలబ్రేట్ చేసుకోవాలని సూచన

బాధపడాల్సిన అవసరం లేదని హితవు



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ రిటైర్మెంట్ ప్రచారంపై మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ స్పందించాడు. రోహిత్ క్రికెట్‌కు వీడ్కోలు పలికే రోజు ఎప్పుడొచ్చినా అది బాధపడాల్సిన సందర్భం కాదని, సంబరాలు చేసుకోవాల్సిన క్షణమని అభిప్రాయపడ్డాడు. లార్డ్స్‌లో జరిగే మూడో వన్డే రోహిత్ చివరి అంతర్జాతీయ మ్యాచ్ కావొచ్చన్న ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆయన స్పందించాడు. “బాధ ఎందుకు? ఇన్నేళ్లుగా రోహిత్ మనందరికీ ఎంతో ఆనందం పంచాడు. ఏదో ఒకరోజు అందరూ క్రికెట్‌ను వీడాల్సిందే. సునీల్ గవాస్కర్, రాహుల్ ద్రవిడ్, అనిల్ కుంబ్లే, సచిన్ టెండూల్కర్ ఇలా అందరూ వీడారు. అలాగే రోహిత్ కూడా ఒకరోజు తప్పకుండా వీడ్కోలు చెబుతాడు” అని కపిల్ దేవ్ అన్నాడు. రోహిత్ వెళ్లే రోజు అతడి కెరీర్‌ను గర్వంగా గుర్తుచేసుకోవాలని కపిల్ సూచించాడు. “దేశానికే కాదు, ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులకు అతడు ఎన్నో అద్భుతమైన క్షణాలు అందించాడు. అలాంటి ఆటగాడి ప్రయాణాన్ని బాధగా కాకుండా సెలబ్రేట్ చేసుకోవాలి” అని పేర్కొన్నాడు. అంతేకాదు, రోహిత్ రిటైర్ అయితే సెంచరీతో చిరస్మరణీయంగా వీడ్కోలు పలకాలని ఆకాంక్షించాడు. “ఏదో ఒకరోజు వెళ్లాల్సిందే. కానీ వెళ్లే ముందు శతకం బాది వెళ్లాలని కోరుకుంటున్నా” అని చెప్పాడు. 2007లో ఐర్లాండ్‌పై వన్డే అరంగేట్రం చేసిన రోహిత్ ఇప్పటికే టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికాడు. ఇంగ్లండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో వరుసగా 11, 26 పరుగులకే పరిమితమవడంతో రిటైర్మెంట్ ఊహాగానాలు జోరందుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు ఎనిమిది వన్డేల్లో 241 పరుగులు చేసిన రోహిత్ సగటు 30.12గా ఉంది. ప్రస్తుతం లార్డ్స్ వేదికగా జరగనున్న నిర్ణయాత్మక మూడో వన్డేపై అందరి దృష్టి నెలకొంది.

# మెస్సీకి గోల్డెన్ ఛాన్స్.. ఫైనల్‌లో బద్దలు కొట్టే 5 రికార్డులివే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదివారం న్యూజెర్సీ స్టేడియంలో స్పెయిన్‌తో జరగబోయే ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్ మ్యాచ్ లో అర్జెంటీనా లెజెండ్ లియోనెల్ మెస్సీ కెరీర్‌లో ఆఖరి ప్రపంచకప్ అయ్యే ఛాన్స్ ఉంది. ప్రస్తుతం 39 ఏళ్ల వయసున్న మెస్సీ.. 43 ఏళ్ల వయసులో 2030లో మరో వరల్డ్ కప్ ఆడటం చాలా కష్టమే కాబట్టి, ఈ మ్యాచ్‌తోనే అతడు తన అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్ బై చెప్పాలని భావిస్తున్నాడు. ఈ టోర్నీలో ఇప్పటికే 8 గోల్స్, 4 అసిస్ట్‌లతో అద్భుత ఫామ్‌లో ఉన్న గోట్ మెస్సీ, ఈ ఫైనల్ మ్యాచ్ లో ఫుట్‌బాల్ చరిత్రలోని పలు ఆల్‌టైమ్ రికార్డులను బద్దలు కొట్టేందుకు సిద్ధమయ్యాడు. ఆ రికార్డుల గురించి ఇప్పుడు ఎ6 వెలుగు వెబ్ సైట్ లో తెలుసుకుందాం..

ఆదివారం మైదానంలోకి అడుగు పెట్టగానే ప్రపంచకప్ ఫైనల్ ఆడిన అత్యంత వృద్ధ అవుట్‌ఫీల్డ్ (గోల్‌కీపర్ కాకుండా) ఆటగాడిగా మెస్సీ రికార్డు సృష్టిస్తాడు.

సరికొత్త సవరణ: ఇక్కడ ఒక చిన్న ఆసక్తికరమైన విషయం గమనించాలి. ఒరిజినల్ నోట్స్‌లో మెస్సీ వయసును పొరపాటున “29 ఏళ్లు” అని పేర్కొన్నారు, కానీ ప్రస్తుతం 2026 జూలై నాటికి మెస్సీ అసలు వయసు 39 ఏళ్ల 25 రోజులు.

1982 ఫైనల్లో ఇటలీ గోల్‌కీపర్ డినో జోఫ్ 40 ఏళ్ల వయసులో ఆడి ఓవరాల్‌గా రికార్డు సృష్టించగా, అవుట్‌ఫీల్డర్లలో మెస్సీదే అగ్రస్థానం కానుంది. అంతేకాదు, ఈ మ్యాచ్‌లో మెస్సీ గనుక ఒక గోల్ చేస్తే.. ఫైనల్లో గోల్ చేసిన అత్యంత వృద్ధ ఆటగాడిగా నిలుస్తాడు. తద్వారా 1958లో 35 ఏళ్ల వయసులో గోల్ చేసిన స్వీడన్ ప్లేయర్ నిల్స్ లీడ్‌హోమ్ రికార్డును అధిగమిస్తాడు.

**మూడు ప్రపంచకప్ ఫైనల్స్ ఆడిన సెకండ్ ప్లేయర్:**

మెస్సీ కెరీర్‌లో ఇది మూడో ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ కానుంది. గతంలో ఆయన 2014 (జర్మనీతో ఓటమి), 2022 (ఫ్రాన్స్‌పై విజయం) ఫైనల్స్ ఆడాడు. ఫుట్‌బాల్ చరిత్రలో 3 ప్రపంచకప్ ఫైనల్స్ ఆడిన రెండో ఆటగాడిగా బ్రెజిల్ దిగ్గజం కాఫు (ఝుటబ – 1994, 1998, 2002) సరసన లియోనల్ మెస్సీ నిలుస్తాడు.

**కెప్టెన్‌గా రెండు వరల్డ్ కప్‌లు గెలిచిన తొలి ఆటగాడు:**

ఫుట్‌బాల్ చరిత్రలో ముందెన్నడూ ఏ కెప్టెన్ కూడా తన జట్టుకు రెండుసార్లు ప్రపంచకప్ టైటిల్ ని ఇప్పటి వరకు అందించలేదు. ఆదివారం అర్జెంటీనా గెలిస్తే, రెండుసార్లు కెప్టెన్‌గా ట్రోఫీని ముద్దాడిన ప్రపంచంలోనే ఏకైక ప్లేయర్ గా మెస్సీ చరిత్ర సృష్టించనున్నాడు.

**ఒకే ఎడిషన్‌లో అటాకింగ్ కాంట్రిబ్యూషన్స్:**

ప్రస్తుత 2026 ప్రపంచకప్‌లో మెస్సీ 8 గోల్స్, 4 అసిస్ట్‌లతో మొత్తం 12 గోల్ కాంట్రిబ్యూషన్స్ (భాగస్వామ్యాలు) అందించాడు. 1970లో పశ్చిమ జర్మనీకి చెందిన గెర్డ్ ముల్లర్ సాధించిన 13 గోల్స్-అసిస్ట్‌ల రికార్డును అధిగమించడానికి మెస్సీకి మరో రెండు పాయింట్లు (గోల్ లేదా అసిస్ట్) మాత్రమే అవసరం. ఒక గోల్ సాధిస్తే ముల్లర్ రికార్డును ఈక్వల్ చేస్తాడు. రెండు సాధిస్తే వరల్డ్ రికార్డ్ బ్రేక్ అవుతుంది.

**అరుదైన రికార్డులు:**

రెండు వేర్వేరు ఫైనల్స్‌లో గోల్స్: స్పెయిన్‌పై లియోనల్ మెస్సీ గోల్ చేస్తే.. రెండు వేర్వేరు ప్రపంచకప్ ఫైనల్స్‌లో గోల్స్ చేసిన 6వ ఆటగాడిగా నిలవనున్నాడు, పెలే, పాల్ బ్రెయిట్నర్, జినెదిన్ జిదాన్, కిలియన్ ఎంబాప్పేల సరసన చేరనున్నాడు.

వరల్డ్ కప్ ఫైనల్స్ మోస్ట్ గోల్స్: 2022 ఫైనల్లో మెస్సీ రెండు గోల్స్ చేశాడు. ఈ మ్యాచ్‌లోనూ రెండు గోల్స్ (దీతీఖెవ) చేస్తే, ప్రపంచకప్ ఫైనల్స్ చరిత్రలో అత్యధిక గోల్స్ చేసిన ఎంబాప్పే రికార్డును సమం చేస్తాడు.

ఫ్రీ-కిక్ రికార్డు: ఒకవేళ మెస్సీ ఫ్రీ-కిక్ ద్వారా గోల్ సాధిస్తే, ప్రపంచకప్ చరిత్రలో అత్యధిక ఫ్రీ-కిక్ గోల్స్ చేసిన ప్లేయర్స్ జాబితాలో అగ్రస్థానానికి చేరుకోనున్నాడు. ప్రస్తుతం అతని ఖాతాలో 2 ఫ్రీ-కిక్ గోల్స్ మాత్రమే ఉన్నాయి.

# అర్జెంటీనా జం స్పెయిన్ మధ్య ఫైనల్ ఫైట్.. ఎవరు గెలిస్తే భారత్‌కు లాభమో తెలుసా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రంవచవ్యాప్తంగా కోట్ల మంది ఫుట్‌బాల్ ఫ్యాన్స్ (ఆదివారం, జూలై 19న) జరగబోయే ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక మెగా సమరంలో డిఫెండింగ్ ఛాంపియన్ అర్జెంటీనా వర్సెస్ స్పెయిన్ జట్లు టైటిల్ కోసం తలపడనున్నాయి. ప్రాణాలు పెట్టి ఆడి, హేమాహేమీ జట్లను మట్టికరిపించి ఈ రెండు టీమ్స్ తుది పోరుకు సిద్ధమయ్యాయి. మన దేశంలో ఫుట్‌బాల్‌కు అంతగా ఆదరణ లేకపోయినా, ఈ ఫైనల్ మ్యాచ్‌పై భారత క్రికెట్ ఫ్యాన్స్ కూడా ప్రత్యేకమైన ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. దీని వెనుక ఒక ఆసక్తికరమైన క్రికెట్ సెంటిమెంట్ దాగి ఉండటమే దీనికి ప్రధాన కారణం.

**2010లో స్పెయిన్ గెలుపు.. 2011లో భారత్ మ్యాజిక్:**

భారత క్రికెట్ ప్రేమికులు ఎప్పటికీ మర్చిపోలేని మధురమైన ఏడాది 2011. మహేంద్ర సింగ్ ధోని కెప్టెన్సీలో భారత జట్టు వన్డే వరల్డ్ కప్ గెలిచి, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ చిరకాల కోరికను నెరవేర్చిన ఏడాది అది.. కానీ దీనికి సరిగ్గా ఒక ఏడాది ముందు, అంటే 2010లో స్పెయిన్ జట్టు ఫిఫా వరల్డ్ కప్ ని సొంతం చేసుకుంది. స్పెయిన్ ఫుట్‌బాల్ కప్ కొట్టిన తర్వాత ఏడాదే టీమిండియా క్రికెట్‌లో వరల్డ్ కప్ గెలిచాం.. కాబట్టి, ఈ సెంటిమెంట్‌కు బలమైన పునాది వేసింది.

**2022 అర్జెంటీనా విజయం..– 2023లో గుండెకోత:**

ఇక ఈ సెంటిమెంట్‌ను ఫ్యాన్స్ మరింత బలంగా నమ్మడానికి మరో కారణం కూడా ఉంది. అదేనండి

బాబోయ్ 2023 వరల్డ్ కప్ ఫలితం.. లియోనల్ మెస్సీ సారథ్యంలోని అర్జెంటీనా జట్టు 2022లో ఫిఫా వరల్డ్ కప్ గెలిచింది. కానీ, ఆ మరుసటి ఏడాది జరిగిన 2023 వన్డే ప్రపంచ కప్‌లో రోహిత్ శర్మ సారథ్యంలోని ఇండియన్ టీమ్ అద్భుతంగా ఆడి ఫైనల్ కి వెళ్లింది. కానీ దురదృష్టవశాత్తూ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో ఘోరంగా ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. అర్జెంటీనా గెలిచిన తర్వాత ఏడాది భారత్‌కు నిరాశే ఎదురవడంతో ఫ్యాన్స్ ఈ లాజిక్‌ను నమ్ముతున్నారు.

**2026 ఫైనల్ ఫలితం.. 2027 వన్డే వరల్డ్ కప్ ఇండియాదేనా:**

ప్రస్తుతం 2026లో జరుగుతున్న ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ ఫలితంపైనే భారత్ 2027 వన్డే వరల్డ్ కప్ భవిష్యత్తు ఆధారపడి ఉందని క్రికెట్ ఫ్యాన్స్ లెక్కలేసుకుంటున్నారు. ఒకవేళ ఈసారి అర్జెంటీనా గెలిస్తే, భారత్ 2027 వన్డే వరల్డ్ కప్ ఫైనల్ వరకు వెళ్లి మళ్లీ ఓడిపోతుందని టెన్షన్ పడుతున్నారు. అదే స్పెయిన్ కానీ గెలిస్తే మాత్రం 2027 వన్డే ప్రపంచ కప్ ఖచ్చితంగా మనమే గెలుస్తామని అభిమానులు బలంగా నమ్ముతున్నారు. ఈ ముచ్చట వినడానికి చాలా విచిత్రంగా ఉన్నప్పటికీ, స్పోర్ట్స్‌లో సెంటిమెంట్స్‌కు ఉండే క్రేజ్ వేరబ్బా..

# బేబీ బంప్‌తో స్టన్నింగ్ లుక్... రెడ్ బీచ్ డ్రెస్‌లో ఆకట్టుకున్న ‘సామజవరగమన’ బ్యూటీ



దక్షిణాది చిత్రసీమలో దూసుకుపోతున్న యషికా ఆనంద్, ఎరుపు రంగు గ్లామరస్ లుక్‌లో మెరిసిపోతోంది.



తెలుగు ప్రేక్షకుల గుండెల్లో సామజవరగమన’ సినిమాతో గుర్తింపు తెచ్చుకున్న మలయాళ ముద్దుగుమ్మ రెబా మోనికా జాన్. తన క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్, సహజమైన నవ్వుతో సౌత్ ఇండియాలో ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్న ఈ నటి, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన కొన్ని ఫోటోలతో సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. థాయిలాండ్‌లోని ఫుకెట్ బీచ్ రిసార్ట్‌లో రెడ్ కలర్ ప్రింటెడ్ మ్యాక్సీ డ్రెస్ ధరించి, తన బేబీ బంప్‌ను చూపిస్తూ ఆమె దిగిన ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి.

**పెళ్లి తర్వాత కూడా కెరీర్‌లో దూకుడు:**

మోడలింగ్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్న రెబా మోనికా జాన్ ట్రెడిషనల్ శారీస్ అయినా, మోడ్రన్ వెస్ట్రన్ వేర్ అయినా చాలా స్టైలిష్‌గా క్యారీ చేస్తుంది. ఈమె 2022 జనవరిలో తన చిరకాల మిత్రుడు జోమోన్ జోసెఫ్‌ను వివాహం చేసుకున్నారు. ఇక ఇక పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో ఎంతో యాక్టివ్‌గా ఉంటున్న ఈ బ్యూటీ, తెలుగులో సామజవరగమన తో పాటు మృత్యుంజయ్, మ్యాడ్ స్క్వేర్ వంటి క్రేజీ చిత్రాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది.

**బీచ్ లో రెడ్ డ్రెస్ హంగామా – ప్రెగ్నెన్సీ గ్లో:**

ప్రస్తుతం ప్రెగ్నెంట్‌గా ఉన్న రెబా, ద నాకా ఫుకెట్ రిసార్ట్‌లో వెకేషన్‌ను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తోంది. అక్కడ బీచ్ ఒడ్డున వైబ్రెంట్ రెడ్ ప్రింటెడ్ స్ట్రాపీ మ్యాక్సీ బీచ్ డ్రెస్ ధరించి సరికొత్తగా ఫోటోలకు పోజులిచ్చింది. హై లెగ్ స్లిట్ ఉన్న ఈ డ్రెస్‌లో ఆమె తన మెటర్నిటీ లుక్‌ను ఎంతో కాన్ఫిడెంట్‌గా ప్రదర్శించింది. ఇక ఇక ఆమె ముఖంలో కనిపిస్తున్న ప్రెగ్నెన్సీ గ్లో చూసి అభిమానులు మురిసిపోతున్నారు. “ప్రెగ్నెన్సీ గ్లో అనేది నిజంగానే అద్భుతం” అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

**సమయం ఎంత వేగంగా గడిచిపోయింది:**

తన బేబీ బంప్ ఫోటోలను షేర్ చేస్తూ రెబా మోనికా జాన్ ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టిన క్యాప్షన్ కూడా అందరినీ ఆకట్టుకుంటోంది. “సమయం ఇంత వేగంగా ఎలా గడిచిపోయింది? బేబీ బంప్‌తో గడిపే చివరి కొన్ని రోజులు ఇవి” అంటూ ఆమె ఎమోషనల్ అయ్యింది. ఇక త్వరలోనే మాతృత్వపు తీపి అనుభూతిని పొందబోతున్న తరుణంలో ఆమె ముఖంలోని ఆనందం ఈ ఫోటోలలో స్పష్టంగా కనిపిస్తోంది. రెబా షేర్ చేసిన ఈ బ్యూటిఫుల్ ఫోటోలు చూసి ఫ్యాన్స్, సెలబ్రిటీలు ఆమెకు పెద్ద ఎత్తున కంగ్రాట్స్ చెప్తున్నారు. ఈ ప్రెగ్నెన్సీ సమయంలో జాగ్రత్తగా ఉండాలంటూ అభిమానులు కామెంట్ల సెక్షన్‌లో ప్రేమను కురిపిస్తున్నారు. సాంప్రదాయ దుస్తుల్లో రాచరికపు అందాన్ని వలకబోసే ఈ సామజవరగమన బ్యూటీ, ఇప్పుడు ప్రెగ్నెన్సీ లుక్‌లోనూ అంతే స్టైలిష్‌గా మరియు క్యూట్‌గా కనిపిస్తూ అందరి హృదయాలను గెలుచుకుంటోంది.



యోధురాలి తరహా బంగారు వర్ణపు వేషధారణలో జియోర్జియా ఆండ్రియాని మెరుపులు

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com